సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 21-3-2025 15/-



## ఆటలో అరటి పండు




## వక్ఫ్ ఆస్తులపై నీలినీడలు

గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 12 హైదరాబాద్
శుక్రవారం 21 మార్చి 2025 రూ.15-00
20 రమజాన్ 1446 హిజ్రీ

**తొలిగీటు**

## కోపావేశం పెచ్చరిల్లినప్పుడు మౌనం వహించండి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**


**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




26

**ఖుర్ఆన్ ప్రస్తావించిన దైవగ్రంథాలు**

## లోపల...


| | | |
|---|---|---|
| కాయకల్ప చికిత్స | ...... | 04 |
| ఆటలో అరటి పండు | ...... | 05 |
| వక్ఫ్ ఆస్తులపై నీలినీడలు | ...... | 08 |
| నరకాగ్ని నుండి రక్షించే మాసం రమజాన్ | ...... | 10 |
| సత్కార్యాల సుధాఝరి రమజాన్ | ...... | 14 |
| ఆర్థిక న్యాయానికి పునాదులు! | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| అమెరికా ఆర్థిక సంక్షోభం ఒక గుణపాఠం | ...... | 20 |
| చరితార్థులు–2 : బేగం సకీనా లుఖ్మాని | ...... | 23 |
| ఆరోగ్యవంతమైన సహరీ, ఇఫ్తార్ | ...... | 24 |
| ఖుర్ఆన్ పఠనం శాంతి, సౌభాగ్యాలకు మార్గం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| దివ్యఖుర్ఆన్ అవతరించిన నెల పవిత్ర రమజాన్ | ...... | 34 |


**బాబు చేతిలో రిమోట్ ....!**



(ముస్లింలకు వ్యతిరేకంగా భాజపా ఏదైనా నిర్ణయం తీసుకుంటే అడ్డుకొని తీరతా – ఎన్నికలప్పుడు చంద్రబాబు వాగ్దానం)

దురాక్రమణ కోసమే
'వక్ఫ్' సవరణ బిల్లు
ముస్లింల ఆస్తులకు
పెడతరటోయ్ చిల్లు!
బాబుగారి చేతిలోనే
ఉన్నదంట రిమోటు
చూడాలిక ఏంజేస్తడో
వద్దు ఇపుడే డిబేటు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## కాయకల్ప చికిత్స

**రాహుల్ గాంధీ** కాంగ్రెసుకు కాయకల్ప చికిత్స చేయడానికి పూనుకున్నట్లు కనిపిస్తోంది. అహ్మదాబాద్‌లో ఇటీవల మాట్లాడుతూ కాంగ్రెసులోని అంతర్గత సంక్షోభాన్ని, బలహీనతను ఆయనే స్వయంగా చెప్పారు. కాంగ్రెసులో ఆరెస్సెస్ భావజాలంతో పనిచేస్తున్నవారున్నారని, వారు పార్టీ ప్రగతిని అడ్డు కుంటున్నారని ఆయన ఒప్పుకున్నారు. ఈ శక్తులను తొలగించకపోతే కాంగ్రెసుకు మళ్ళీ పూర్వప్రాభవం రాదని అన్నాడు కూడా. అయితే గతంలో ఈ శక్తులు ఎవరో, ఇప్పుడెవరో, ఎప్పుడు తొలగిస్తున్నారో ఆయన వివరాలు చెప్పలేదు. అయితే పి.వి. నరసింహారావు గురించి మణిశంకర్ అయ్యర్ గతంలో చేసిన వ్యాఖ్య చాలా మందికి గుర్తుండే ఉంటుంది. దేశంలో మొదటి బీజేపీ ప్రధాని పి.వి. అని అయ్యర్ చెప్పారు.

అహ్మదాబాద్‌లో రాహుల్ ప్రసంగం దేశ రాజకీయాలను మలుపుతిప్పే శక్తి కలిగిన ప్రసంగం. స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ సెక్యులర్ మార్గంపై నడిస్తే, ఆరెస్సెస్ హిందూరాష్ట్ర మార్గాన్ని ఎంచుకుంది. కాని జరిగిందేమిటంటే, క్రమేణా కాంగ్రెస్ సెక్యులరిజం పలచబడింది. ఆరెస్సెస్ చాపక్రింద నీరులా కాంగ్రెసులో విస్తరించింది. ఆరెస్సెస్ భావజాలం ఉన్న వారికి ఉన్నత పదవులు కూడా కట్టబెట్టింది. చివరకు సాఫ్ట్ హిందూత్వ రాజకీయాల ద్వారా గెలిచే ప్రయత్నాలు కూడా చేసింది. అటు పూర్తి స్థాయిలో సెక్యులర్ కాదు, ఇటు పూర్తిగా హిందూత్వ కూడా కాదు. కాంగ్రెస్ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడి అయ్యింది.

రాహుల్ కాంగ్రెస్ చేసిన తప్పులను ఒప్పుకుంటున్నారు. కాంగ్రెస్ చేసిన అతి పెద్ద తప్పు ఆరెస్సెస్ విస్తరణను పట్టించుకోకపోవడం. చివరకు కాంగ్రెసులోనే ఆరెస్సెస్ శక్తులు తిష్ఠ వేసి కాంగ్రెసును డొల్ల చేశాయి. సైద్ధాంతికంగా కాంగ్రెసును అయోమయస్థితికి నెట్టేశాయి. ఫలితంగా ప్రజల విశ్వాసాన్ని పార్టీ కోల్పోయింది. బాబరీ మస్జిద్ విధ్వంసం, ప్రధానిగా పి.వి. నిష్క్రియాపరత్వం, హిందూత్వ రాజకీయాలను అడ్డుకోవడంలో కాంగ్రెస్ వైఫల్యం– ఇవన్నీ ఇప్పుడు చరిత్రలో నమోదయ్యాయి.

కాంగ్రెసు నాయకత్వం రాజకీయంగా రాజీధోరణి ప్రదర్శించడం ద్వారా అధికారాన్ని అంటిపెట్టుకుని కొనసాగే ప్రయత్నాలు చేసిందన్నది కూడా వాస్తవమే. ఒకవైపు లౌకికవాదం నినాదాలు, మరోవైపు ఆరెస్సెస్ సానుభూతిపరులుగా గుర్తింపు పొందిన వారికి పెద్ద పెద్ద పదవులు. 1980 దశకంలో, 1990 దశకంలో కాంగ్రెసు తీసుకున్న అనేక నిర్ణయాల వెనుక హిందూత్వ రాజకీయాల ఒత్తిళ్ళున్నాయి. బాబరీ మస్జిద్ తాళం తెరువడం మొదలు రామమందిర ఉద్యమానికి పరోక్షంగా సహకరించడం వరకు కాంగ్రెసు ద్వంద్వవైఖరికి నిదర్శనాలు చాలా ఉన్నాయి. మతఘర్షణల్లో కాంగ్రెసు ప్రభుత్వాలు తమాషా చూశాయి. ఫలితంగా మైనారిటీలు కాంగ్రెసుకు దూరమయ్యారు.

ఇప్పుడు రాహుల్ గాంధీ చేసిన ప్రకటన కాంగ్రెసులో కుదుపులకు కారణమయ్యింది. యువ నాయకత్వం ఇది ధైర్యంతో తీసుకున్న నిర్ణయంగా భావిస్తుంటే సీనియర్ నేతలు మౌనంగా చూస్తున్నారు. మతతత్వ శక్తులు కాంగ్రెసులోను చొరబడ్డాయని ఒప్పుకునే మౌనం ఇది.

కాని, రాహుల్ గాంధీ అన్న మాట ప్రకారం పని చేస్తారా? పార్టీ బతికి బట్టకట్టాలంటే ఈ పని చేయకతప్పదు. కేవలం అంతర్గత శత్రువును గుర్తిస్తే చాలదు, ఇలా ఎందుకు జరిగిందన్న ఆత్మావలోకనం జరగాలి. సైద్ధాంతికంగా గట్టిగా నిలబడాలి. క్షేత్రస్థాయిలో సైద్ధాంతిక పార్టీగా ప్రజల విశ్వాసాన్ని మరలా సంపాదించుకోవాలి.

రాహుల్ గాంధీ ఈ ప్రక్షాళన జరపగలరా? ఆరెస్సెస్ పట్ల సానుభూతితో పనిచేసే కాంగ్రెసు అగ్రనేతలను తొలగించగలరా? లేక కేవలం ప్రసంగాలకు మాత్రమే ఈ మాటలు పరిమితమా? వేచి చూద్దాం. ✤

అబ్దుల్ వాహెద్

# ఆటలో అరటి పండు



ముహమ్మద్ షమీ గురించి ఇప్పుడు అందరికీ తెలుసు. ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు. గొప్ప ఫాస్ట్‌బౌలరు. అయితే ఇటీవల కాలంలో అతను రెండు వివాదాల్లో చిక్కుకున్నాడు.

తాజా వివాదం, ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫి దుబాయిలో జరుగుతోంది. ఆస్ట్రేలియాతో మ్యాచ్ ఆడుతున్నప్పుడు ఎనర్జీ డ్రింక్ తాగాడు. పవిత్ర రమజాను మాసంలో ఉపవాసం పాటించకుండా ఇలా ఎనర్జీ డ్రింక్ తాగడం మహాపరాధమని మౌలానా షహబుద్దీన్ రిజ్వీ విమర్శించారు. ఆ వెంటనే సోషల్ మీడియాలో పెద్ద వివాదం రగులుకుంది. దేశం కోసం షమీ ఆడుతున్నాడని, అలాంటప్పుడు ఉపవాసం ఎలా ఉంటాడనీ, దేశం గొప్పదా, మతం గొప్పదా అంటూ వెల్లువలా విమర్శలు వచ్చి పడ్డాయి. దీనిపై టీవీల్లో చర్చలు కూడా జరిగాయి. మొత్తానికి దేశమా? మతమా? అనేలా చర్చను మార్చేసి హిందూ ముస్లిం చేసే అవకాశం దొరికింది.

దీనికి ముందు ఒక వివాదం ముహమ్మద్ షమీకి సంబంధించినదే చాలా మందికి గుర్తుండే ఉంటుంది. టి20 వరల్డ్ కప్ క్రికెట్‌లో పాకిస్తాన్‌లో మ్యాచ్ ఇండియా ఓడిపోయినప్పుడు షమీ ముస్లిం కాబట్టి అతని వల్లే ఓడిపోయిందన్నట్లు ట్రోలింగ్ జరిగింది.

ఈ రెండు వివాదాలను చూసినప్పుడు ఒక సందేహం కలుగుతుంది. టి20 వరల్డ్ కప్ అప్పుడు షమీ దేశప్రేమను ప్రశ్నిస్తూ ట్రోల్ చేసిన వాళ్ళే ఇప్పుడు మతం కన్నా దేశం గొప్పదంటూ ఈ వివాదంలో హంగామా చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. మతమా? దేశమా? అన్న బైనారీలోకి తోసేయడమే అసలు ఉద్దేశ్యంగా స్పష్టంగా కనిపిస్తోంది. నిజానికి ఇలా చేస్తున్న వారికి మతమూ ముఖ్యం కాదు, దేశమూ ముఖ్యం కాదు. హిందూ ముస్లిం విద్వేషాలు రాజేయడమే ముఖ్యం.

ఎందుకంటే –

వరల్డ్ కప్ 2023లో శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా కూడా

మరో వివాదం షమీకి సంబంధించినదే ముందుకు వచ్చింది. షమీ ఆ మ్యాచ్ విజయం తర్వాత ఫీల్డులోనే ముస్లిముల ప్రార్థనా పద్ధతి మాదిరిగా సజ్దా చేశాడని గగ్గోలు మొదలైంది. ఈ విషయమై స్వయంగా షమీ మాట్లాడుతూ తాను భారతీయుడిగాను గర్విస్తున్నానని, ముస్లిముగాను గర్విస్తున్నానని, ఫీల్డులో తాను సజ్దా చేయాలనుకుంటే తననెవ్వరు ఆపలేరని, కాని అక్కడ తాను సజ్దా చేయలేదని అన్నాడు. ఒకవేళ గెలిచిన సంతోషంతో దేవుడికి కృతజ్ఞతగా ఫీల్డులో సజ్దా చేస్తే అందులో తప్పుందా? అలా ఇంతకు ముందు చేసినవారెవ్వరు లేరా?

ఇప్పుడు తాజా వివాదాన్ని మరోసారి చూద్దాం. షమీ మ్యాచ్ సందర్భంగా ఎనర్జీ డ్రింక్ ఏదో తాగుతూ కనిపించాడు. దానిపై ఒక మౌలానా వెంటనే ధార్మిక తీర్పు ఇచ్చేశారు. ఆయనకు ఈ తీర్పు ఇవ్వాలని ఎందుకు అనిపించింది? ఎవరైనా అడిగారా? ఈ ప్రశ్న కాస్త కీలకమైనది.

గతంలో సానియా మీర్జాకు సంబంధించిన ఒక వివాదం చాలా మంది ఇప్పుడు మరిచిపోయి ఉంటారు. సానియా మీర్జా స్కర్టుతో ఆడడం గురించి ఏమంటారని ఒక మౌలానాను అడిగితే ఆయన వెంటనే అలాంటి దుస్తులతో ఆడడం ఇస్లాంలో సమ్మతం కాదని చెప్పారు. ఆ వెంటనే మామూలుగానే ఇస్లాం మహిళలను అణచేస్తుందనే వివాదం రాజుకుంది. ఈ ప్రశ్న అడిగిన వ్యక్తికి స్పష్టంగా తెలుసు, మౌలానా ఈ ప్రశ్నకు ఏం జవాబు ఇస్తాడన్నది. ఆ జవాబు కావాలి కాబట్టే అడిగి రాబట్టుకుని, దాన్ని ఒక పెద్ద సంచలనం చేసి, వార్తగా అమ్ముకున్నాడు. ఆ వెంటనే ఇస్లాంపై, ముస్లిములపై రకరకాల విమర్శలు వెల్లువెత్తాయి.

ఇప్పుడు ఈ సదరు మౌలానా షమీపై ఈ ధార్మిక తీర్పు ఎందుకు చెప్పారన్నది కూడా ఆలోచించుకోవలసిన విషయమే.

ఎవరైనా ఏదైనా అంశంపై ధార్మిక అభిప్రాయాన్ని అడిగితే వెంటనే చెప్పడం అవసరమా? అడిగిన వ్యక్తి ఉద్దేశ్యమేమిటి? ఎందుకు అడుగుతున్నాడు? వంటి ప్రశ్నల గురించి ఆలోచించి, జవాబు ఇవ్వదగిన ప్రశ్న అయితేనే జవాబు ఇవ్వాలనే నియమం ఏదీ ఉండదా? వంటి ప్రశ్నలు కూడా పుడుతున్నాయి. ఒక ప్రశ్న స్వీకరించదగిందా? కాదా? అన్న విచక్షణ ధార్మిక తీర్పులు ఇచ్చేవారు పాటించాలా? లేదా?.. ధర్మవేత్తలు ఆలోచించుకోవాలి.

ఇక అసలు విషయానికి వస్తే, రమజాను మాసంలో ఉపవాసాలు పాటించడం ముస్లిములకు తప్పనిసరి విధి.

కాని –

ప్రముఖ దక్షిణాఫ్రికా క్రికెట్ క్రీడాకారుడు హాషిం ఆమ్లా తెలుసు కదా. ఆయన 2012లో లండనులో ఇంగ్లాండుపై 311 పరుగులు చేశాడు. అప్పట్లో ఆయన ఉపవాసం ఉండి ఇన్ని పరుగులు చేశాడని కొందరు ప్రచారంలో పెట్టారు. కాని అది అబద్ధం. ముహమ్మద్ షమీని ట్రోల్ చేయడానికి కొందరు ఈ వార్త ప్రచారంలో పెట్టారు. ఆమ్లా గురించి అందరికీ బాగా తెలుసు. ప్రాక్టీసింగ్ ముస్లిం అని స్పష్టంగా ప్రకటిస్తాడు. అలాంటి వ్యక్తి రమజాను మాసంలో ఆ మ్యాచ్ ఆడి భారీగా పరుగులు చేశాడు. తాను ఉపవాసం పాటించలేదని కూడా స్పష్టంగా చెప్పాడు. అయితే తినడం తాగడం అన్ని డ్రెస్సింగ్ రూములోనే చేసేవాడు. ఉపవాసాలు పాటించే ఇతరులను గౌరవిస్తూ ఫీల్డులో ఏదీ తాగేవాడు కాదు. ఉపవాసం ఎందుకు ఉండలేదని అడిగితే ఆయన స్పష్టంగా జవాబిస్తూ తాను ఇంటికి దూరంగా ప్రయాణంలో ఉన్నాను కాబట్టి ఉపవాసం వదిలేసే మినహాయింపు ఉందని, తర్వాత ఇంటికి చేరుకున్న పిదప తాను వదిలిన ఉపవాసాలు పూర్తి చేసుకుంటానని అన్నాడు.

ఈ చిన్న విషయం మౌలానా గారికి తెలియదా. ఇదే విషయాన్ని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు కార్యనిర్వాహక సభ్యుడు మౌలానా ఖాలిద్ రాషిద్ ఫరంగీ మహ్లీ చెప్పారు. ముస్లిములు రమజానులో ఉపవాసాలు పాటించడం తప్పనిసరి అని చెబుతూ, కాని ప్రయాణంలో ఉంటే, వ్యాధితో ఉంటే ఉపవాసాల మినహాయింపు లభిస్తుంది. షమీ ప్రయాణంలో ఉన్నాడు కాబట్టి అతనికి మినహాయింపు ఉంటుందని అన్నారు.

ఉపవాసాలు పాటించే విషయంలో ఈ నియమనిబంధనల గురించి పెద్దపెద్ద మౌలానాల వరకు వెళ్ళనవసరం లేదు. సాధారణ ముస్లిములకు కూడా మౌలికమైన ఈ నియమాలు తెలుసు. అలాంటప్పుడు ఒక మౌలానా గారు ఈ విషయమై ముహమ్మద్ షమీని తీవ్రంగా విమర్శించడం ఎలా జరిగింది?

ఆలోచించవలసిన మరో విషయమేమిటంటే, మన ఇంట్లో లేదా మన మిత్రుల్లో లేదా మనకు తెలిసిన వారిలో ఎవరైనా ఏదైనా తప్పు చేస్తున్నట్లు కనిపిస్తే, వారికి హితోపదేశం చేయాలనుకుంటే,

దానికి సంబంధించిన మర్యాదలు కూడా ఇస్లాము పేర్కొంది. ఒక మౌలానాకు ఈ మర్యాదలు తెలియవా? హితోపదేశాన్ని మృదువుగా, వివేకవంతమైన మాటలతో, ఎదుటి వారి మనసును గాయపరచకుండా మాట్లాడాలి. బహిరంగంగా అందరి ముందు చేయరాదు, ఏకాం తంలో మెల్లగా చెప్పాలి. అంతేకాని బాహాటంగా అమర్యాద కరంగా మనసు గాయపరిచేటట్లు పరువు తీసేవిధంగా హితోప దేశం చేసే పద్ధతిని ఏమనుకోవాలి? ఇలా చెప్పేలా ప్రేరేపిస్తున్న పరిస్థితులేమిటి?

ఈ ప్రశ్నలపై కూడా ఆలోచించాలి.

సరే ఏది ఏమైనా ఈ వివాదం నేపథ్యంలో భారతదేశం ఛాంపియన్స్ ట్రోఫీ గెలుచుకుంది. గెలుపు సంబరాలు జరుపుకోవడం సహజమే.

కాని .. గెలుపు సంబరాలను కూడా హిందూ ముస్లిం విద్వేషాగ్ని రగిల్చడానికి వాడుకోవడం జరక్కపోతే ఎలా? అందుకే గెలుపు సంబరాల పేరుతో మస్జిద్ ముందుకెళ్ళి, రెచ్చగొట్టే నినాదాలు చేసి ఘర్షణలకు కారణమయ్యారు. మధ్యప్రదేశ్ మహులో ఈ సంఘటన జరిగింది. ఇలా ఎందుకు జరిగింది?

సంబరాలు జరుపుకోడానికి మస్జిదు ముందుకు వెళ్ళి రెచ్చగొట్టే నినాదాలు ఇచ్చేవాళ్ళు దేశప్రేమికులా?

ముహమ్మద్ షమీ తన తల్లితో పాటు ఉన్నాడు. విరాట్ కోహ్లి అక్కడికి వెళ్ళి ఆమెకు పాదాభివందనం చేశాడు. అక్కడ మతతత్వం లేదు. కాని సంబరాల పేరుతో దేశంలో మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్న వారెవరు?


ఈ ప్రశ్నలు అందరూ ఆలోచించవలసినవి. ఈ ప్రశ్నలతో పాటు ఆలోచించుకోవలసిన ప్రశ్నలు మరికొన్ని ఉన్నాయి. ముస్లిములు ఉపవాసాలు పాటించడం తప్పనిసరిగా చేస్తున్నారంటే అది వారి ధార్మిక విశ్వాసం. దేశ సంవిధానం ప్రతి మతస్తునికి మతాన్ని అవలంబించే స్వేచ్ఛను ఇస్తుంది.

ఇప్పుడు భలే కొత్త వాదనలు కూడా వస్తున్నాయి. ఉపవాసాల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని కొందరు సైంటిఫిక్ టెంపును ప్రజల్లో ప్రచారం చేయడానికి, ప్రజారోగ్యంపై తమకున్న ఆందోళనను వెళ్ళగక్కుతున్నారు. స్కూలుకు వెళ్ళే పిల్లలు కూడా ఉపవాసాలు పాటించి చదువులు పాడు చేసుకుంటున్నారని మరికొందరు ప్రబుద్ధులు వాపోతున్నారు. దీన్ని తిప్పికొట్టడానికి సైన్సు కూడా ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ లాభాలు చెబుతుందని ఇటువైపు వారు వాదిస్తున్నారు. ఉపవాసాల వల్ల నష్టాలున్నాయని చెప్పేవారు ఒకరైతే, ఈ మతం వాళ్ళను విమర్శించి భలే పని చేస్తున్నార్రా అని సందట్లో సడేమియా అంటూ తమ వ్యాఖ్యలు చేసేవారు మరికొందరు. సైంటిఫిక్‌గా ఉపవాసాల ప్రయోజనాలు చెప్పే ప్రయత్నం ద్వారా ఉపవాసాలను సమర్థించుకోవాలని ప్రయత్నించేవారు ఇటువైపు. అసలు ఈ వాదవివాదాలు అవసరమా?

ఎవరి మతవిశ్వాసాలు వారివి. ముస్లిములు తమ మతవిశ్వాసం ప్రకారం ఉపవాసాలు ఉంటున్నారు. కేవలం దేవునికి భయపడి, దైవాదేశాల ప్రకారం ఉపవాసాలుంటున్నారు. అందువల్లనే ఎవరి ఒత్తిడి లేకపోయినా, ఒంటరిగా తినడానికి తాగడానికి అవకాశం ఉన్నప్పటికీ నిష్ఠగా ఉపవాసం ఉంటారు. దీన్ని సమర్థించుకోడానికి ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ సైంటిఫిక్ ప్రయోజనాల గురించి చెప్పుకోవలసిన అవసరం లేదు. ఉపవాసం వల్ల లభించే ఆరోగ్య లాభాల కోసం ఉపవాసాలు పాటించడం లేదు. దేవుని ఆజ్ఞ కాబట్టి చేస్తున్నామని ఖచ్చితంగా చెప్పవచ్చు. దేవుని ఆజ్ఞ కాబట్టే ఎవరి ఒత్తిడి లేకపోయినా సంపదలో రెండున్నర శాతం జకాత్ స్వచ్ఛందంగా తీసి పేదసాదలకు ఇస్తున్నామని కూడా గర్వంగా చెప్పవచ్చు.

ఎలాగూ రమజాన్ ఉపవాసాలు చర్చకు వచ్చాయి కాబట్టి కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకుందాం. ఉపవాసాలు పాటించడం ముస్లిములకు తప్పనిసరి విధి. ఆరోగ్యంగా అన్నీ బాగున్నా ఉపవాసాలు ఉద్దేశ్యపూర్వకంగా విడిచిపెట్టడం నిస్సందేహంగా ధర్మం ప్రకారం అపరాధమే. అయితే, ప్రయాణంలో ఉన్నవారు, వ్యాధిగ్రస్తులు, ఉపవాసం పాటించే శక్తి లేని ముసలివారు, గర్భిణీ మహిళలు, రుతుస్రావం, పురిటి రక్తస్రావం అవుతున్న స్త్రీలు పాలుపట్టే తల్లులు...ఇలా ఉపవాసం విషయంలో మినహాయింపులు కూడా ఉన్నాయి.

కాని ఇస్లాము గురించి, ముస్లిముల గురించి అపార్థాలు, అపోహలు మాత్రమే ప్రచారంలో ఉన్న వాతావరణంలో, వాట్సప్ యూనివర్శిటీ ద్వారా లభించే జ్ఞానం మాత్రమే అందుబాటులో ఉన్న కాలంలో ఇస్లామోఫోబియా పెరుగుతూ పోతోంది. ఇస్లాం గురించి, ముస్లిముల గురించి, ముస్లిం విశ్వాసాలు, సంప్రదాయాల గురించి తెలియజేసి అపార్థాలు, అపోహలు తొలగించవలసిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది. ✤




# వక్ఫ్ ఆస్తులపై నీలినీడలు

- వాహెద్

**వక్ఫ్ బిల్లును** పార్లమెంటరీ జాయింట్ కమిటీకి పంపించిన తర్వాతి ప్రహసనం మనందరికీ తెలిసిందే. వక్ఫ్ బిల్లు విషయంలో ప్రతిపక్ష సభ్యుల సూచనలను పట్టించుకోకుండా యథాతథంగా బిల్లును స్పీకర్‌కు కమిటీ నివేదించింది. ప్రస్తుత సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి.

ముస్లిములకు రాజ్యాంగపరంగా లభించిన హక్కులను ఈ బిల్లు కాలరాస్తుందని జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షులు సాదతుల్లా హుస్సేనీ అన్నారు. ఈ బిల్లు చట్టమైతే ముస్లిములు తమ వక్ఫ్ ఆస్తుల నిర్వహణాధికారాన్ని కోల్పోతారని, వక్ఫ్ ఆస్తులకు చట్టబద్ధంగా లభించిన రక్షణలన్నీ అంతరిస్తాయని ఆయన చెప్పారు.

ధార్మిక స్థలాలను నిర్వహించుకునే అధికారం దేశంలో కేవలం ముస్లిములకు మాత్రమే కాదు అన్ని మతాల వారికి రాజ్యాంగం ఇచ్చిందని ఆయన చెప్పారు. కాని కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లుకు సవరణలు చేయడం ద్వారా ముస్లిములకు ఈ హక్కు లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయమై ప్రజల్లో చైతన్యం పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని కూడా ఆయన చెప్పారు. ఈ బిల్లుపై తమ అభ్యంతరాలను ముస్లిములు వ్యక్తిగతంగాను, ముస్లిం పర్సనల్ లా బోర్డు ద్వారాను ప్రభుత్వానికి నివేదించారని, జమాఅతె ఇస్లామీ హింద్ కూడా తన అభ్యంతరాలను తెలియజేసిందని అన్నారు.

కాని ప్రభుత్వం ఈ అభ్యంతరాలను లెక్క చేయడం లేదు. ఏదో ఒక విధంగా బిల్లును ఆమోదించడానికి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పుడు భారీస్థాయిలో నిరసన ప్రదర్శనలు నిర్వహించడం తప్ప మరో ప్రత్యామ్నాయమేదీ లేదని ఆయన అభిప్రాయపడ్డారు. వక్ఫ్ ఆస్తులు దేవుని ఆస్తులని వాటిని కాపాడడం

ప్రతి ముస్లిం బాధ్యత అని ఆయన చెప్పారు.

మరోవైపు ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షులు మౌలానా ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ కూడా ఇదేవిధమైన అప్పీలు చేశారు. జమీఅతె ఉలమా హింద్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదనీ ప్రభుత్వ వైఖరిని నిరసించారు. ముస్లిములు తమ హక్కుల కోసం రోడ్లపైకి రాక తప్పడం లేదన్నారు. ఈ బిల్లు ఒకవేళ చట్టమైతే జమీఅత్ న్యాయస్థానాల ద్వారా పోరాడుతుందని అన్నారు.

ఈ బిల్లు ముస్లిముల హక్కులను హరిస్తుందంటూ నిరసిస్తున్న వారు శాంతియుతంగా నిరసన ప్రదర్శనలకు పూనుకోవడంలో తప్పేముంది. కాని బీజేపీ మిత్రపక్షంగా ఉన్న షిండే శివసేన నాయకుడు సంజయ్ నిరుపమ్ దేశంలో జలియన్‌వాలా బాగ్ వంటి సంఘటనలు చోటు చేసుకుంటాయని బెదిరించాడు.

ఈ బెదిరింపు ఎందుకు చేశాడంటే - ముస్లిం పర్సనల్ లా బోర్డు వక్ఫ్ సవరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదిస్తే దేశం మరో షాహీన్ బాగ్ నిరసనలు చూస్తుందని అన్నారు. షాహీన్ బాగ్ నిరసనలను నిర్వహించింది మహిళలు. అక్కడ రెచ్చగొట్టే నినాదాలు చేసిన మతతత్వ శక్తులేవో అందరికీ తెలుసు. పర్సనల్ లా బోర్డు ఈ ప్రకటన చేసిన తర్వాత సంజయ్ నిరుపమ్ మాట్లాడుతూ పర్సనల్ లా బోర్డు ఇలాంటి ప్రకటనలు చేస్తే దేశంలో జలియన్ వాలా బాగ్ మాదిరి పరిస్థితి ఏర్పడుతుందన్నాడు. పర్సనల్ లా బోర్డు చెప్పిన మాటల ప్రకారం షాహిన్ బాగ్ వంటి నిరసన జరిగితే అది శాంతియుతంగా మహిళలు చేసే ప్రదర్శన మాత్రమే అవుతుంది. ముస్లిం పర్సనల్ లా బోర్డు శాంతియుత నిరసన ప్రదర్శనల గురించే మాట్లాడింది.

కాని మతతత్వం తలకెక్కిన సంజయ్ నిరుపమ్ బెదిరిస్తోంది జలియన్ వాలా బాగ్ మాదిరి పరిస్థితులు తలెత్తుతాయని. జలియన్‌వాలా బాగ్‌లో ఏం జరిగింది? శాంతియుతంగా సమావేశమైన నిరాయుధ ప్రజలపై తెల్లవాళ్ళ ప్రభుత్వం కాల్పులు జరిపించి వందలాది మందిని హతమార్చింది. సంజయ్ నిరుపమ్ ఏం చెప్పాడో దీన్ని బట్టి స్పష్టంగా అర్థమవుతుంది. జలియన్‌వాలా బాగ్‌లో శాంతియుతంగా సమావేశమైన వారిపై కాల్పులు జరిపించిన మాదిరిగానే, ఇప్పుడు షాహీన్ బాగ్ మాదిరిగా శాంతియుత నిరసన తెలిపితే కాల్పులు జరిపి చంపేస్తామని చెబుతున్నాడు. ఇది ఇప్పటి భారత దేశంలో ప్రజాస్వామ్యం పరిస్థితి. ముస్లిం పర్సనల్ లా బోర్డు మాటల్లో బెదిరింపు ఉందా? ఈ సంజయ్ నిరుపమ్ వంటి మతతత్వ నేతల మాటల్లో బెదిరింపు ఉందా? పాఠకులే గ్రహించగలరు. కాని బీజేపీ నాయకుడు, జాయింట్ పార్లమెంటరీ కమిటీలో ఏదో ఒక విధంగా బిల్లుపై చర్చ జరక్కుండా, ప్రతిపక్ష నేతల సూచనలేవీ స్వీకరించడం లేకుండా యథాతథంగా తిరిగి స్పీకరుకు పంపించే ఘన కార్యం సాధించిన పార్లమెంటరీ కమిటీ చైర్మన్ జగదాంబికా పాల్ మాత్రం ముస్లిం పర్సనల్ లా బోర్డు నిరసనలు చేపడతామనడాన్ని బెదిరింపు ధోరణి అంటున్నాడు. ఈ చట్టం ఎలాగైనా తీసుకొచ్చి తీరుతామని అన్నాడు.

ఈ నేపథ్యంలో మరో వార్త బుద్ధగయ నుంచి వచ్చింది. అక్కడ బౌద్ధులు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. బౌద్ధుల పవిత్ర ప్రదేశం బుద్ధగయలో హిందూ ప్రాబల్యాన్ని నిరసిస్తున్నారు. బుద్ధగయలో బౌద్ధుల నిరసనలు చూస్తే, కొత్త వక్ఫ్ చట్టం వల్ల భవిష్యత్తులో తలెత్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

బుద్ధగయలో మహాబోధి మందిర ప్రదేశం వద్దనే బుద్ధుడికి ఆత్మజ్ఞానం లభించిందంటారు. ఈ ఆరాధనా ప్రదేశాన్ని ఒక కమిటి నిర్వహిస్తుంది. బుద్ధుడు పదో అవతారంగా హిందూ పండితులు చెబుతారు. కాబట్టి ఈ మందిరంపై తమకు హక్కుందని అంటున్నారు. బౌద్ధులు ఈ వాదనను తిరస్కరిస్తున్నారు. ఈ మందిరంపై బౌద్ధులకు హక్కు లేకుండా చేయడానికే ఇలాంటి మాటలు చెబుతున్నారని అంటున్నారు. ఈ మందిర నిర్వహణ కమిటిలో నలుగురు హిందువులు ఉండాలని చట్టం చేశారు. మరో నలుగురు బౌద్ధులు సభ్యులుగా ఉంటారు. జిల్లా కలెక్టరు చైర్మనుగా ఉంటారు. పైగా గయా కలెక్టరుగా హిందువు మాత్రమే ఉండాలన్న నియమం కూడా ఉంది. కాబట్టి ఈ కమిటిలో హిందువులదే మెజారిటీ. మరో విషయమేమిటంటే, బోధగయమఠ్ ఒకటి ఉంది. బోధ్ గయ మఠ్‌లో బౌద్ధులెవ్వరు సభ్యులు కాలేరు. కాని బోధగయ మఠ్‌కు చెందిన ఒక హిందువును తప్పని సరిగా మహాబోధి మందిర కమిటీలో సభ్యునిగా తీసుకోవాలి.

"ప్రపంచంలో ఒక మతం పవిత్ర ప్రదేశాన్ని మరో మతస్తులు ఆక్రమించుకున్న పరిస్థితి మరెక్కడా కనిపించద" ని ఆకాష్ లామా అనే బౌద్ధ నేత చెప్పారు. బుద్ధగయ టెంపుల్ చట్టాన్ని రద్దు చేయాలని నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి.

వక్ఫ్ బిల్లు ఆమోదం పొందితే ఇదే పరిస్థితి దేశవ్యాప్తంగా ముస్లిం వక్ఫ్ ఆస్తుల విషయంలోను తలెత్తుతుంది. వక్ఫ్ ఆస్తులు ఇప్పటికే చాలా వరకు అన్యాక్రాంతమై పోయాయి. మిగిలిన ఆస్తులపై కూడా తిష్ఠవేసే ప్రయత్నమే ఈ వక్ఫ్ బిల్లు.

❖ ❖ ❖

# నరకాగ్ని నుండి రక్షించే మాసం

# రమజాన్

- డా. సాజిద్ అబ్బాసీ

**మనిషి ఊహించగలిగే** అత్యంత బాధాకరమైన శిక్ష సజీవ దహనం. ఈ లోకంలోని అగ్ని కూడా ఎంత శక్తివంతమైనదంటే, మనిషిని కొన్ని నిమిషాల్లో బూడిద కుప్పగా మార్చేస్తుంది. నరకాగ్ని ఈ లోకంలోని అగ్ని కంటే డెబ్బై రెట్లు తీవ్రంగా ఉంటుందని ప్రవక్త ముహమ్మద్ (స) తెలిపారు. ఆ అగ్ని గురించి అల్లాహ్ స్వయంగా ఇలా తెలియజేశాడు:

"ఎంత ధైర్యం వీరికి, నరక శిక్షను సైతం భరించటానికి సిద్ధంగా ఉన్నారు!" (2:175). ఈ లోకంలోని అగ్నిని మనం కొన్ని క్షణాలు కూడా భరించలేము. నరకాగ్ని శాశ్వతమైనది. నరకాగ్నిలో చర్మం కాలిపోయిన వెంటనే శరీరానికి కొత్త చర్మం తొడగడం జరుగుతుంది. ఆ విధంగా అగ్నిశిక్ష కొనసాగుతూ ఉంటుంది *(సూరా నిసా 56).* నరకంలో శాశ్వతమైన శిక్ష అగ్ని శిక్ష. దుర్మార్గులకు నరకమే పాన్పు, నరకమే దుప్పటి అని చెప్పడం జరిగింది *(సూరా ఆరాఫ్ 41).* నరకాన్ని తప్పించుకుని స్వర్గంలో ప్రవేశించినవాడిదే సాఫల్యమని ఖుర్ఆన్ సావధాన పరచింది *(సూరా ఆలె ఇమ్రాన్ 185).* అల్లాహ్ తన దాసులు నరకానికి వెళ్ళాలనుకోడు. ఒక తల్లి తన బిడ్డ అగ్నికాహుతి కావడాన్ని భరించగలదా? తల్లికన్నా అనేకరెట్లు అధికంగా తన దాసులని ప్రేమించే అల్లాహ్ ఎలా భరించగలడు? కాని మరో వైపు అల్లాహ్ న్యాయం ప్రకారం అవిశ్వాసం, బహుదైవారాధన, కాపట్యం, అన్యాయాలకు ప్రతిఫలం నరకమే. అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

**"కాని ఆయన తన దాసులు తిరస్కార వైఖరిని అవలంబించటాన్ని ఇష్టపడడు. ఒకవేళ మీరు కృతజ్ఞతలు తెలిపితే, దాన్ని ఆయన మీ కొరకు ఇష్టపడతాడు"** *(సూరా జుమర్: 7).*

అందువల్లనే అల్లాహ్ తన దాసులను నరకం నుండి కాపాడే దారిని కూడా చూపించాడు. దేవుని వైపు మరలే అనేక అవకాశాలు కల్పించాడు. వారికి వ్యవధినిస్తూ పోతున్నాడు. ఘోరమైన నేరాల తర్వాత కూడా అల్లాహ్ పశ్చాత్తాపపడే అవకాశాన్నిచ్చాడు. కారుణ్యం చూపడాన్ని తనపై తప్పనిసరి చేసుకున్నానని అల్లాహ్ తెలియజేస్తున్నాడు. (సూరా అన్ ఆమ్ 12, 54). కరుణామయుడు అనే గుణనామంలోనే అల్లాహ్ అపరిమితంగా కరుణించేవాడనే భావం ఉంది. అందువల్ల పెద్ద పెద్ద అపరాధాలు, పాపాలు కూడా క్షమించబడతాయి. అల్లాహ్‌ను విశ్వసించినందుకు అగ్నిగుండాలను రాజేసి విశ్వాసులను అందులోకి విసిరి వారు దగ్ధమవ్వడాన్ని చూసి కేరింతలు కొట్టిన దైవ తిరస్కార, కందకాల (ఉఖ్‌దూద్) పాలకుల వంటి పాపులకు కూడా అల్లాహ్ పశ్చాత్తాపపడే అవకాశం ఇస్తున్నాడు. ఈ భయంకరమైన అపరాధం తర్వాత కూడా వారు పశ్చాత్తాపపడితే క్షమించబడే అవకాశం ఉందన్నాడు *(సూరా బురూజ్: 10).* క్షమాభిక్ష పొందాలంటే మొదటి షరతు, దాసుడు తాను చేసిన అపరాధం పట్ల సిగ్గుపడి, అల్లాహ్ వైపు మరలాలి. రెండవ షరతు ఏమిటంటే, మరణానికి ముందు పశ్చాత్తాపం చెందాలి. ఈ విషయంలో అల్లాహ్ అవిశ్వాసులకు గొప్ప బహుమానమే ఇచ్చాడు. మార్గభ్రష్టత్వ చీకట్ల నుండి బయటకు వచ్చి అల్లాహ్ వైపు మరలినవారు, అల్లాహ్‌ను విశ్వసించి, సత్కార్యాలు చేయడం ప్రారంభిస్తే వారి పాపాలు క్షమించబడటమే కాదు, అవి పుణ్యాలుగా లెక్కించబడతాయన్నాడు. *(సూరా ఫుర్కాన్: 70).*

అల్లాహ్ కారుణ్యమిది. ఏ పాపాల కారణంగా నరకానికి వెళ్లడం ఖాయమో, ఆ పాపాలను క్షమించడమే కాదు పుణ్యాలుగా మార్చి బహుమానాలు ప్రసాదించడం జరుగుతుంది. ఇంతకీ ప్రశ్న ఏమిటంటే, అల్లాహ్ ఇంతగా ఎందుకు అనుగ్రహిస్తున్నాడు? అన్నది. ఎందుకంటే అవిశ్వాస చీకట్లు, బహుదైవారాధన అంధకారం ఎంత దట్టంగా ఉంటుందో దాని నుంచి బయటపడడం అంతే కష్టం. ఈ కష్టాన్ని అధిగమించి అల్లాహ్ వైపు మరలిన వాడి ప్రయత్నాన్ని అల్లాహ్ అభినందిస్తాడు. ప్రతిఫలంగా అతని పాపాలను పుణ్యాలుగా మారుస్తాడు. కానీ ఈ అవకాశం మరణం రాకముందే, త్రికరణశుద్ధిగా పశ్చాత్తాపం చెందే వారికి మాత్రమే లభిస్తుంది. మనిషి మరణించిన వెంటనే అల్లాహ్ న్యాయశాసనం అమలు ప్రారంభం అవుతుంది.

అపరిమిత కరుణాకటాక్షాలను, క్షమాభిక్షను పొందే అవకాశం మరణం రాకముందు వరకు మాత్రమే లభిస్తుంది. ఫిరౌన్ కూడా సత్యధర్మాన్ని విశ్వసించాలని, అల్లాహ్ వైపు మరలాలని అను కున్నాడు, కాని అప్పటికే ఆలస్యమైపోయింది, సముద్రంలో మునిగిపోతూ మరణాన్ని కళ్ళారా చూస్తున్నప్పుడు విశ్వసించాలని అనుకున్నాడు *(సూరా యూనుస్ 90 – 92).* మృత్యువు ఎప్పుడు వస్తుందో ఎవరూ చెప్పలేరు. లభించిన జీవితకాలంలో దేవుని మన్నింపు కోరుతూ, పశ్చాత్తాపపడే అవకాశం లభించిన వారు చాలా అదృష్టవంతులు. కరుణామయుడు (రహ్మాన్) అనే గుణనామంలో అపరిమితంగా కరుణించేవాడనే భావన ఉంది. ఇది ప్రాపంచిక జీవితంలో అల్లాహ్ వైపు మరలాలని భావించే ప్రతి మనిషికి లభిస్తుంది. ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం అల్లాహ్ గుణనామాల్లో రహీమ్ (కృపాశీలుడు) అనేది మరణానంతర జీవితంలో విశ్వాసులకు ప్రత్యేకంగా లభించే దేవుని కనికరం. తిరస్కారులుగా, అవిశ్వాసులుగా, దేవునికి భాగస్వాములను కల్పించేవారు మరణించిన తర్వాత దేవుని న్యాయశాసనం ప్రకారం నరకానికి పోతారు. వారి శిక్ష తగ్గించబడదు *(సూరా బఖర: 162).* వారికి అల్లాహ్ తాను అన్యాయం చేయలేదని, నిజానికి వారు తమకు తామే అన్యాయం చేసుకున్నారని తెలియ జేస్తాడు *(సూరా ఆలె ఇమ్రాన్: 117).* ఎందుకంటే, ఘోరాతి ఘోరమైన అపరాధాలు చేసినవాడు కూడా మృత్యువు రాకముందే దేవుని మన్నింపుకోరుతూ పశ్చాత్తాపపడే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటే అల్లాహ్ కారుణ్యం లభించే అవకాశం ఉంది. మృత్యుదూత రాకముందే తప్పులను తెలుసు కుని, మరలా అలాంటి పాపాలు చేయబోనని నిజాయితీగా పశ్చాత్తాపపడాలి. అల్లాహ్ అలాంటి పశ్చాత్తాపిని మన్నించడానికి సిద్ధంగా ఉన్నానని అంటున్నాడు.

మనిషి పాపాల మీద పాపాలు చేస్తూ పోతే అల్లాహ్ కారుణ్యానికి దూరమవుతూ పోతాడు. అలాంటి వ్యక్తి అల్లాహ్‌తో మన్నింపు కోరడానికి కూడా సంకోచిస్తాడు. ఇన్ని పాపాలు చేసిన తాను అల్లాహ్‌తో మన్నింపు ఎలా కోరాలనే నిరాశా నిస్పృహలకు గురవుతాడు. షైతాన్ కూడా మనిషి నిరాశను మరింత పెంచి అల్లాహ్‌కు మరింత దూరం చేయాలనుకుంటాడు. ఇలాంటి వారిని ఉద్దేశించి అల్లాహ్ ఎంతో అనునయంగా ఇలా సెలవిచ్చాడు:

> **(ఓ ప్రవక్తా!) ఇలా అను, "మీ ఆత్మలకు అన్యాయం చేసు కున్న నా దాసులారా! అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్ని పాపాలనూ క్షమి స్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించే వాడూను" *(సూరా జుమర్: 53).***

అల్లాహ్ తన వైపు మరలే దాసుని చూసి చాలా సంతోషిస్తాడు. ఎంత సంతోషిస్తాడంటే, దీన్ని ఒక హదీసు ఉపమానం ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఒక వ్యక్తి ఎడారిలో ప్రయాణిస్తున్నాడు. అతని సామగ్రి సామానులన్నీ ఒంటెపై ఉన్నాయి. ఆ ఒంటె ఎడారిలో ఎక్కడో తప్పిపోయింది. ఎడారిలో అతని జీవితమే ప్రమాదానికి గురయ్యే పరిస్థితి వచ్చి పడింది. అలాంటి మనిషికి తప్పిపోయిన ఒంటె అకస్మాత్తుగా కళ్ళ ముందు కనిపిస్తే ఎంత సంతోషిస్తాడో, దేవుడు కూడా తనవైపు మరలే దాసుని చూసి అంతగా సంతో షిస్తాడు.

రమజాన్ మాసాన్ని కరుణ, క్షమాపణ, నరకం నుండి విముక్తి పొందే నెలగా అల్లాహ్ చేశాడు. మనిషికి రమజాన్ నెల అమూల్యమైన వరప్రసాదం వంటిది. ప్రతి సంవత్సరం విశ్వాసులకు లభించే వెలలేని అనుగ్రహాల మాసం ఇది. ఈ అవకాశాన్ని ఉపయో గించుకుని మనిషి నరకం నుంచి విముక్తి పొందడానికి ప్రయ త్నించాలి. మనకు తెలిసీ తెలియక అనేక పాపాలకు పాల్పడు తుంటాం. ఈ పాపాలు పెరిగి పెరిగి మనల్ని నరకానికి దగ్గర చేస్తాయి. రమజాన్ నెల వచ్చి, ఉ పవాసాలు, నమాజులు, సదాచరణల ద్వారా మనల్ని నరకానికి దూరం, స్వర్గానికి దగ్గరయ్యేలా చేస్తుంది. చివరకు నరక విముక్తి లభిస్తుంది. కాబట్టి, అపరాధాలు, పాపాలు, తప్పులు ఎన్ని ఉన్నప్పటికీ దైవకారుణ్యం పట్ల నిరాశ చెందరాదు. పశ్చాత్తాపం ద్వారా పాపక్షమాపణ పొందే అవకాశం దేవుడు కల్పించాడు. రమజాన్ నెల వంటి వరప్రసాదం లభించినప్పటికీ ఈ నెలలో క్షమాపణ పొందే ప్రయత్నాలు చేయలేని వ్యక్తి సర్వనాశనమైనట్లే అని ప్రవక్త ముహమ్మద్ (స) అన్నారు.

లైలతుల్ ఖద్ర్ గురించి ప్రవక్త ముహమ్మద్ (స) వివరిస్తూ, ఈ రాత్రికి సంబంధించిన అమూల్యమైన అనుగ్రహాలను పొందలేని వ్యక్తి అత్యంత దురదృష్టవంతుడని అన్నారు. లైలతుల్ ఖద్ర్ వెయ్యి నెలల కంటే ఉత్తమమైనదిగా చెప్పబడింది. అంటే ఈ ఒక్క రాత్రి చేసే ఆరాధన వెయ్యి నెలల ఆరాధన కంటే ఉత్తమ మైనది. మనిషికి సగటు ఆయుష్షు కన్నా కాస్త ఎక్కువ లభిస్తే, జీవితకాలం కూడా దాదాపు వెయ్యినెలలే (83 సంవత్సరాలు). అంటే కేవలం ఒక్క రాత్రి ఆరాధన ద్వారా యావత్తు జీవితకాల ఆరాధనల పుణ్యఫలాన్ని పొందే అవకాశం ప్రతి సంవత్సరం అల్లాహ్ కల్పిస్తున్నాడు. అందువల్ల ప్రతి రమజాన్‌ను జీవితంలో చివరి రమజాన్‌గా భావించి జీవించడమే బుద్ధిమంతులు చేయ వలసిన పని. రమజాన్ చివరి పది రోజులలో లైలతుల్ ఖద్ర్‌ను

ప్రత్యేక శ్రద్ధతో అన్వేషించాలి. బేసి రాత్రులలో మాత్రమే కాకుండా, చివరి పది రోజుల్లోని అన్ని రాత్రులు ప్రార్థనలు, మన్నింపు వేడుకోళ్ళతో గడపాలి. ఈ రాత్రికి ఒక ప్రత్యేక ప్రార్థన ఉంది, దీనిని ప్రవక్త ముహమ్మద్ (స) ఆయిషా (రజి)కు నేర్పించారు: **"అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వా ఫాఫు అన్నీ"** అంటే "ఓ అల్లాహ్! నిశ్చయంగా నువ్వు అధికంగా క్షమించేవాడివి, క్షమించడాన్ని ఇష్టపడతావు, కాబట్టి నన్ను క్షమించు."

ధార్మిక విశ్వాసంతో, జవాబుదారితనంతో రమజాన్ ఉపవాసాలు పాటించినవారి, రమజాన్ రాత్రులలో నమాజులు చేసినవారి, లైలతుల్ ఖద్ర్‌లో ఆరాధనలు చేసినవారి గత పాపాలన్నీ క్షమించబడతాయని ప్రవక్త ముహమ్మద్ (స) అన్నారు. ధార్మిక విశ్వాసం, ఉపవాసం, నమాజులు–ఇవన్నీ మనం చేస్తున్నామంటే అగోచరాలను విశ్వసిస్తున్నామనే అర్థం. అల్లాహ్ ఉనికిని పరిపూర్ణంగా విశ్వసిస్తున్నామని భావం. ప్రళయదినాన, తీర్పు రోజున కళ్ళారా స్వర్గ నరకాలను చూస్తే ఎలా విశ్వసిస్తామో అలాంటి విశ్వాసం ఉండాలి. ఈ విశ్వాసం ఎలా లభిస్తుంది? దానిని ఎలా పెంచుకోవచ్చు? ఖుర్‌ఆన్ పఠనం (అర్థం చేసుకుని చదవడం) ద్వారా ఈ విశ్వాసం లభిస్తుంది *(సూరా అన్‌ఫాల్: 2).* ఖుర్‌ఆన్ గురించి మనిషి ఎంత లోతుగా యోచిస్తాడో అంతగా ఈ విశ్వాసం పెంపొందుతుంది. ధార్మిక విశ్వాసాన్ని పటిష్టపరచడానికి ఖుర్‌ఆన్‌లో బలమైన వాదనలున్నాయి. నేడు ముస్లింలు చాలా మంది ఖుర్‌ఆన్‌ను పుణ్యం కోసం మాత్రమే చదువుతున్నారు. హితబోధ కోసం, మార్గదర్శకత్వం కోసం అనువాదాలు, వ్యాఖ్యానాల సహాయంతో అర్థం చేసుకుంటూ, అవగాహన చేసుకుంటూ చదవడం లేదు. లాంఛనప్రాయంగా పుణ్యం లభిస్తుందని ఖుర్‌ఆన్ పారాయణం చేస్తున్నారు. దీనివల్ల ఏమవుతుందంటే, రమజాన్ ముగిసిన వెంటనే ఉపవాసాల ప్రభావం కూడా మటుమాయమైపోతోంది. మనలో గనక చైతన్యంతో కూడిన ధార్మిక విశ్వాసం ఉంటే, ఉపవాసాల ఉద్దేశ్య లక్ష్యాల స్పృహ మనలో ఉన్నట్లయితే ఈ ఉపవాసాల ప్రభావాలు మిగిలిన పదకొండు నెలల పాటు మనలో ఉంటాయి. ప్రతిసారి రమజాన్ మాసం మన విశ్వాసాన్ని, భయభక్తులను మరింత పెంపొందించేదిగా మారుతుంది. బాధ్యతా భావం, దేవునికి జవాబు చెప్పుకోవాలన్న జవాబుదారితనంతో ఉపవాసాలు పాటించడం, నమాజులు చేయడం అంటే, దైవం మనల్ని చూస్తున్నాడన్న స్పృహతో, దేవుడు మన సంకల్పాలు, ఉద్దేశ్యాలు, అన్నీ తెలిసినవాడన్న చైతన్యంతో ఆరాధనలు చేయడం. దేవునికి జవాబు చెప్పుకోవాలన్న స్పృహ ఉండడమంటే, మన ఉపవాసాలు, నమాజులకు దేవుని ప్రతిఫలం తప్పక లభిస్తుందన్న గట్టి నమ్మకం ఉండడం. ప్రపంచంలో ప్రతి మనిషికి తన శ్రమకు తగ్గ ప్రతిఫలం లభిస్తుందనే నమ్మకం ఉంటే మనిషి శ్రద్ధాసక్తులతో ఆ పనిలో నిమగ్నమై కష్టపడి పని చేస్తాడు. ప్రతిఫలం లభిస్తుందనే నమ్మకమే లేకపోతే ఎవ్వరూ శ్రద్ధాసక్తులతో కష్టపడి పని చేయరు. అందువల్ల దేవుడు మన ఆరాధనలను, ఉపవాసాలను, నమాజులను చూస్తున్నాడని, తగిన ప్రతిఫలం తప్పక ప్రసాదిస్తాడనే బలమైన విశ్వాసం ఉండాలి. ఉపవాసాల్లో జవాబుదారితనం, భక్తిశ్రద్ధలు, ధార్మిక విశ్వాసం లోపిస్తే ఆ ఉపవాసాలు సామాజిక ఒత్తిడి వల్ల చేసినవి అవుతాయే కాని, భక్తితో చేసినవి కావు. అందువల్ల, గత పాపాల క్షమాపణకు ధార్మిక విశ్వాసం, జవాబుదారితనం తప్పనిసరి షరతులయ్యాయి.

రమజాన్ నెలలో దేవుని కారుణ్యం పరాకాష్ఠ స్థాయిలో ఉంటుంది. నరకశిక్షల నుంచి విముక్తి కోరుతూ వేడుకోళ్ళు, దుఆలను ఈ మాసంలో వీలయినంత ఎక్కువగా చేయాలి.

అనస్ బిన్ మాలిక్ (రజి) ప్రకారం, ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు, "ఎవరైనా మూడుసార్లు స్వర్గం ప్రసాదించమని వేడుకుంటే, స్వర్గం స్వయంగా దేవునితో 'ఓ అల్లాహ్! అతన్ని స్వర్గంలో ప్రవేశపెట్టు' అని అంటుంది. అలాగే ఎవరైనా మూడుసార్లు అగ్నిశిక్ష నుండి రక్షణ కోరితే, అగ్ని స్వయంగా 'ఓ అల్లాహ్! అతన్ని అగ్ని నుంచి కాపాడు' అని చెబుతుంది."

మానవులను నరకానికి చేర్చే పనులు ఏమిటని ఆలోచిస్తే, అది అవిశ్వాసం అని తెలుస్తుంది. "ఎవరు అవిశ్వాసం అవలంబించి అవిశ్వాస స్థితిలోనే అసువులు బాసారో, వారిలో ఎవరైనా తమను తాము శిక్ష నుండి కాపాడుకోవటానికి భూమినంతా బంగారం నింపి పరిహారంగా ఇచ్చినా స్వీకరించబడదు అనే విషయం నిశ్చయం. ఇలాంటి వారికొరకు బాధాకరమైన శిక్ష సిద్ధంగా ఉంది. ఇంకా వారికి సహాయం చేసేవారెవరూ ఉండరు."*(సూరా ఆలె ఇమ్రాన్: 91).*

అవిశ్వాసానికి శాశ్వత నరక శిక్ష ఎందుకు? అవిశ్వాసం అంటే దేవుని ఉనికిని తిరస్కరించడం. దేవుని ఉనికిని తిరస్కరించడం ద్వారా మనిషి దేవుని అపార అనుగ్రహాలను తిరస్కరిస్తున్నాడు. దేవుడు ప్రసాదించిన లెక్కలేనన్ని అనుగ్రహాలను వాడుకుంటూ దేవుని పట్ల కృతజ్ఞత చూపించడు. విశ్వంలో దేవుని ఉనికిని నిరూపించే లెక్కలేనన్ని చిహ్నాలను చూస్తాడు, కానీ వాటిని పట్టించుకోడు, తన స్వంత బుద్ధిని ఉపయోగించి దేవుని తిరస్కరిస్తాడు. ఈ విశ్వాన్ని ఎవరు సృష్టించారు? మనిషి ఈ

ప్రపంచంలో ఎందుకు వచ్చాడు? మరణం తరువాత ఏమి జరుగుతుంది? అనే ప్రాథమిక ప్రశ్నల గురించి ఆలోచించడు. ఈ ప్రాథమిక ప్రశ్నలకు సమాధానాలు పొందడానికి తన బుద్ధిని ఉపయోగించడు. కానీ భౌతిక వాంఛలను తీర్చుకోడానికి తన బుద్ధిని పూర్తిగా ఉపయోగిస్తాడు.

**"ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయం అందించే వాడెవడూ లేడు."**

*(మాయిద: 72)*

దేవునికి భాగస్వాములను కల్పించడం దేవుని వద్ద క్షమార్హం కాని అపరాధం. ఎవరైనా తన స్వంత తండ్రిని నిర్లక్ష్యం చేసి, పరాయి వ్యక్తికి తండ్రి స్థానమిచ్చి, సేవలు చేస్తే, గౌరవిస్తే అది న్యాయవిరుద్ధమూ, దౌర్జన్యమూ అవుతుంది.

దేవుని స్థాయి తండ్రి స్థాయి కన్నా అనేకానేక రెట్లు పెద్దది. మనల్ని, మన తండ్రి తాతలను పుట్టించింది ఆ దేవుడే. అందువల్ల దేవుని కాదని ఇతరులను ఆరాధించడం క్షమార్హం కాని అపరాధమవుతుంది.

అలాగే, ముస్లింలలోని కపట విశ్వాసులు, ముస్లిముల్లో చేరి ఉన్నప్పటికీ గుండెల్లో ధార్మిక విశ్వాసం ఉండదు. "కపటులు నరకంలో అట్టడుగు ప్రదేశానికి పోతారు. వారికి సహాయం చేసేవాడెవడూ మీకు దొరకడు." *(సూరా నిసా: 145).* ఇలాంటి వారు రెండు అపరాధాలకు పాల్పడుతున్నారు. ఒకటి విశ్వసించకపోవడం, రెండవది విశ్వసించామని అబద్ధాలు చెప్పడం. ఇలాంటి వారిని నరకం దిగువ స్థాయిలో పారేయడం జరుగుతుంది. అక్కడ శిక్ష అత్యధికంగా ఉంటుంది.

అలాగే పెద్దపెద్ద పాపాలు చేసినవారు. విశ్వసించినప్పటికీ పెద్ద పాపాలకు పాల్పడి, పశ్చాత్తాపపడని వారు నరకానికి చేరుకుంటారు. హదీసుల్లో మహాపరాధాలు ప్రస్తావించబడ్డాయి. అహంకారం, వ్యభిచారం, మద్యపానం, వడ్డీ మొదలైనవి మహాపరాధాలు.

అలాగే ప్రజల హక్కులను కబళించడం. ప్రళయదినాన ఒక మనిషి అనేక పుణ్యాలతో వస్తాడు. కాని అతను ఇతరుల హక్కులను హరించినవాడు. మొదట అతని వల్ల హక్కులు నిరాకరించబడిన వారికి అతని పుణ్యాలను పంచేయడం జరుగుతుంది. ఒకవేళ అతని పుణ్యాలు మిగలకపోతే, ఇతరుల పాపాలను అతను ఏ మేరకు వారి హక్కులను హరించాడో ఆ మేరకు అతనిపై వేయడం జరుగుతుంది. ఆ తర్వాత, అతన్ని నరకంలో పడవేస్తారు. అలాంటి వ్యక్తి గురించి, ప్రవక్త ముహమ్మద్ (స) వ్యాఖ్యానిస్తూ "నా అనుచర సమాజంలో అతనే పరమ దరిద్రుడు" అని చెప్పారు. ఇతరుల సొమ్ము అన్యాయంగా తినడం, దౌర్జన్యాలు చేయడం, హత్యలు, అఘాయిత్యాలు చేయడం, స్త్రీలను చెరచడం వంటి అపరాధాలకు పాల్పడినా కొన్ని ఆరాధనలు, పుణ్యకార్యాలు అంటే ఉమ్రా, హజ్, రమజాను ఉపవాసాలు వంటివి పాటిస్తే, తాను చేసిన దౌర్జన్యాలన్నీ క్షమించబడతాయని అనుకోరాదు. ఆరాధనలో లోపాలను దేవుడు ఇష్టమైతే క్షమిస్తాడేమో కాని, ఇతరుల హక్కులను హరిస్తే బాధితులు క్షమించే వరకు దేవుడు కూడా క్షమించడు. ✤


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

## Bank Details

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




"అల్లాహ్ భూభాగాల్లో మక్కా భూభాగాన్ని మహోన్నతమైన భూభాగంగా ఎన్నుకున్నాడు. మాసాల్లో రమజాను మాసాన్ని మహిమాన్వితమైన మాసంగా ఎన్నుకున్నాడు. రోజుల్లో శుభ ప్రదమయినదిగా శుక్రవారం రోజును ఎన్నుకున్నాడు. రాత్రుల్లో లైలతుల్ ఖద్ర్‌ను ఘనమైనదిగా చేశాడు" అన్నారు ఖతాద (ర). పైన పేర్కొన్న విశిష్టతల్లో రెండు రమజాన్‌కు సంబంధించినవే. అంది వచ్చిన ఈ సువర్ణావకాశాన్ని ఒడిసి పట్టుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

విశ్వాస సోదరులరా! అల్లాహ్ మీ ధన, మాన, ప్రాణాలను కాపాడా లని మీరు కోరుకుంటున్నారా? మీకు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) వారి దీవెనలు పొందాలని ఉందా? ప్రపంచం లోని సంపదలకంటే గొప్ప సంపదను మీ సొంతం చేసుకోవాలను కుంటున్నారా?

"ఓ ప్రవక్తా! నీవు నీ ప్రభువు తరపు నుండి అవతరింపజేయబడిన దానిని (ప్రజల వరకు) చేరవేయి. నిశ్చయంగా అల్లాహ్ ప్రజల (కీడు) నుండి నిన్ను తప్పక కాపాడుతాడు". (మాయిదహ్- 67) "అల్లాహ్ ఆ వ్యక్తిని సుభిక్షంగా ఉంచుగాక! ఎవరయితే నా నుండి నా మాటను విని దాన్ని ఇతరుల వరకు చేర వేసాడో". వేరొక ఉల్లేఖనంలో-"నీ మాధ్యమంగా అల్లాహ్ ఒకే ఒక్క వ్యక్తికి సన్మార్గం చూపినా అది నీ పాలిట ప్రపంచ సకల సంపదలకంటే ఎంతో మేలయినది" అని అన్నారు ప్రవక్త (స).

రమజాను మాసం ధర్మబోధ మాసం కూడా. ఈ మాసం సన్మార్గం మరచి బ్రతుకుతున్న అల్లాహ్ దాసుల్ని ఆయన మార్గం వైపునకు ఆహ్వానించాల్సిన బాధ్యత ఒక ముస్లింగా మనందరిపై ఉంది. మన ఈ బాధ్యతను మనం ఓ మంచి మాట ద్వారా అయినా నెరవేర్చగలము. ఒక కరపత్రాన్ని అందజేసి నిర్వర్తించగలము. ఒక షార్ట్ మెసేజ్ పంపి అయినా చేయగలము. మన పిల్లాడు నిప్పుల కుంపటిలో పడబోతున్నాడని తెలిస్తే మనం ఎంతగా నయితే తల్లడిల్లి పోతామో అలాగే మార్గం మరచి జీవిస్తున్న తోటి మానవుల విషయంలో సయితం మనం చలించిపోవాలి. ఇలా మనం చేసిన నాడు అల్లాహ్ కారుణ్య కడలి మన వైపు కదిలొస్తుంది.

విశ్వాస సోదరులరా! అల్‌హమ్దులిల్లాహ్ మనం ఉపవాసాలు పాటిస్తున్నాము. ఖుర్‌ఆన్ పారాయణం చేస్తున్నాము. తరావీహ్ ప్రార్థనల్లో ఎంతో నిష్ఠగా పాల్గొంటున్నాము. దానధర్మాలు విస్తృత స్థాయిలో చేస్తున్నాము. ఇఫ్తార్ కార్యక్రమాలూ జరుపుతున్నాము. తల్లిదండ్రులను సయితం కంటికి రెప్పలా చూసుకుంటున్నాము. అల్లాహ్ దాసుల్ని అల్లాహ్ మార్గం వైపునకు ఆహ్వానిస్తున్నాము. అయినా మన ఆచరణలు అల్లాహ్ సన్నిధిలో ప్రవేశ పెట్టబడటం లేదు. ఎందుకో తెలుసా? వినండి! "ప్రతి సోమవారం, ప్రతి గురువారం స్వర్గ ద్వారాలు తెరవబడతాయి. అల్లాహ్‌తోపాటు అన్యులను సాటి కల్పించని (షిర్క్ చేయని) ప్రతి వ్యక్తికి అల్లాహ్

క్షమాభిక్ష ప్రాప్తిస్తుంది- ఓ వ్యక్తికి తప్ప. అతనికి అతని సోదరునికి మధ్య పగ ఉంది. వారి విషయంలో ఇలా అనబడుతుంది: ''వీరికి గడువు ఇవ్వండి- వీరు సంధి చేసుకొని. వీరికి వ్యవధి ఇవ్వండి- వీరు సంధికి రాని'' అని.

నిజంగా సంధికి మించిన సత్కార్యం లేదు. స్వయంగా అల్లాహ్ ఇలా అంటున్నాడు: ''నిశ్చయంగా విశ్వాసులు పరస్పరం సోదరులు. కావున మీ సోదరుల మధ్య సంధి చేయించండి''. (హుజురాత్: 10) వేరొక చోట- ''రాజీపడటం ఎంతో ఉత్తమ మయిన కార్యం''. అలాగే మన సమావేశ ఉద్దేశ్యాల్లో 'ప్రజల మధ్య సంధి చేయించడం కూడా ఒకటి' అని మనకు తెలుస్తుంది. ప్రవక్త(స) అనేక సందర్భాలలో అనేక సహాబా మధ్య సంధి కుదిర్చిన సందర్భాలున్నాయి. స్వయంగా అల్లాహ్ సుబ్హానహు వ తఆలా సయితం ఇద్దరు సోదరుల మధ్య సంధి కుదిర్చి, ఆ సంధి కుదర్చడానికి కృషి చేసినవారికి అపార అనుగ్రహాల్ని ప్రసాదించి మరి వారిరువురిని స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు అని వేరొక ఉల్లేఖనం ద్వారా తెలుస్తుంది. కాబట్టి నేడే ఈనాడే మనకు మన సోదరులకు మధ్య ఏదేని విషయంలో వివాదం ఉంటే, వారొచ్చి రాజీకి రావాలని ఎదురు చూడటం మాని మనమే వెళ్ళి వారితో సంధి చేసుకోవాలి. ఈ రమజాను మాసం పూర్తయ్యే లోపు ఏ ధార్మిక కారణం లేకుండా ఎవ్వరితోనూ ఎలాంటి వివాదం ఉండకూడదు. మనమే వెళ్లి వారికి సలామ్ చేద్దాం. ఆ నిమిత్తం అల్లాహ్ నేర్పిన దుఆను రమజాను మాసం చివరి క్షణం దాకా చేస్తూనే ఉందాం! ''రబ్బనఘ్ఫిర్‌లనా వలి ఇఖ్వానినల్లజీన సబఖూనా బిల్ ఈమాన్, వలా తజ్అల్ ఫీ ఖులూబినా గిల్లల్ లిల్లజీన ఆమనూ రబ్బనా ఇన్నక రవూఫుర్రహీమ్''. వారిలా ప్రార్థిస్తారు: ''ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందర్నీ క్షమించు. (యావత్తు) విశ్వాసుల పట్ల మా హృదయాల్లో ఎలాంటి అసూయాద్వేషాలు ఉంచకు. ప్రభూ! నీవు గొప్ప క్షమాశీలివి, అపార దయామయుడవు.'' (అల్-హష్ర్: 10) ఆమీన్.

విశ్వాస సోదరులారా! మీకెప్పుడయినా చేయి కాలిన అనుభవం ఉందా? లేదంటే వెలిగే దీపంలో కాసేపు వేలు పెట్టి చూడండి. చురుక్కుమంటుంది. మనస్సు చివుక్కుమంటుంది. అమ్మా! లేదా అబ్బా అన్న శబ్దం అప్రయత్నంగా మీ నోట వెలువడుతుంది. నరకాగ్నిని 70 సార్లు కడిగితే మిగిలిన వేడి మన ప్రపంచపు మొత్తం అగ్నిది. ఆ అగ్నిలోని కొంతలో కొంత గోరంత దీప సెగకే విలవిల్లాడి పోతుంటే రేపు నరకాగ్ని సెగకు మనం తట్టుకోగలమా చెప్పండి! అక్కడేమో చర్మాలు కాలిన కొద్దీ కొత్త చర్మాలు పుట్టుకొస్తుంటాయే! అల్లాహ్ మనందరినీ నరకాగ్ని నుండి కాపాడుగాక!

విశ్వాస సోదరులరా! రమజాను మాసం నరక ముక్తి మాసం. ప్రవక్త (స) అన్నారు: ''ప్రతి రోజు అల్లాహ్ కొందరిని నరకాగ్ని నుండి కాపాడుతూ ఉంటాడు''. అలాగే ప్రవక్త (స) సెలవిచ్చిన మాట- ''మిమ్మల్ని మీరు నరకాగ్ని నుండి కాపాడుకోండి! ఒక్క ఖర్జూర ముక్కను దానం చేసి అయినా సరే''.

విశ్వాస సోదరులరా! ప్రాపంచిక విషయంలో మనిషి మహా ఆత్రగాడిలా వ్యవహరిస్తాడు. ఒకవేళ అతనికి ఒక బంగారు లోయ దొరికితే ఇంకొకటి ఉంటే బావుండు అంటాడు. రెండు లోయలు నిండా బంగారం దొరికితే మూడోది ఉంటే ఇంకా బావుండు అని అంటాడని స్వయంగా అల్లాహ్ సుబ్హానహు వ తఆలా సెలవి చ్చాడు. ప్రాపంచిక పరిమిత ప్రాపర్టీ విషయలో ఇంత ప్రాకులాడితే, పరలోక సిసలయిన, శాశ్వతమయిన సత్కార్యాల సామగ్రి విషయంలో ఎంత శ్రద్ధ కలిగి ఉండాలో ఆలోచించండి! మరి మీకు అలాంటి లోయలు నిండిన పుణ్యాలు కావాలను కుంటున్నారా? మహా పర్వతమంతటి పుణ్యాన్ని సొంతం చేసుకోవాలనుకుంటున్నారా? ఒక పర్వతం మాత్రమే కాదు మాకు రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు మహా పర్వతాలు కావాలని కోరుకుంటున్నారా? అల్‌హమ్దులిల్లాహ్ ఆ ఏర్పాటు కూడా ఉంది, అంతిమ దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు: ''ఎవరయినా జనాజా నమాజు చదివి జనాజా వెంట వెళ్ళకుండా ఆగిపోతే అతనికి ఒక ఖీరాత్ పుణ్యం లభిస్తుంది. ఒకవేళ దాని వెంట వెళితే అతనికి రెండు ఖీరాత్‌ల పుణ్యం లభిస్తుంది. అది విన్న సహాబా''ఖీరాత్ అంటే ఏమిటి?'' అని ఆరా తీశారు. అందుకాయన (స)- ''ఖీరాత్‌లోని అత్యల్ప భాగం ఉహుద్ కొండంతదై ఉంటుంది'' అని సమాధానమిచ్చారు. (ముస్లిం).

ప్రియ మిత్రులారా! రమజాన్ దానధర్మాల మాసం కూడా. ప్రవక్త ముహమ్మద్(స) ప్రభంజనం కన్నా వేగంగా దానధర్మాలు చేసేవారు. కాలగర్భంలో కలిసిపోయే వారికి, చరిత్రలో నిలిచి పోయేవారికి ముఖ్యమైన తేడాల్లో ఒకటి-దాతృత్వం! స్వభావరీత్యా దాతలైనవారిని లోకం గౌరవిస్తుంది. అప్యాయంగా కొలుస్తుంది. ఆదర్శంగా భావిస్తుంది. దైవ ప్రవక్తలు, వారి సహచరులు, పుణ్యాత్ములు- ఎప్పుడో కీర్తిశేషులయ్యారు. అయినా ఇప్పటికీ వారి గురించి చెప్పుకొంటున్నామంటే- వారి దానశీలతే అందుకు కారణం. ఈ లోకం ప్రత్యేకత ఏంటంటే- మనం చెప్పిన మంచి మాటలను బట్టి కాకుండా, చేసిన మంచి పనులను బట్టి మన

గొప్పదనాన్ని అంచనా వేస్తుంది. కాబట్టి మనల్ని శాశ్వతంగా నిలబెట్టేవి శిలా విగ్రహాలు, శిలా శాసనాలు కావు- మన శీల స్వభావాలు!

ఆ రెండింటికన్నా ముఖ్యమైన మూడోది- భయపడుతూ దానం చేయడం. తాను చేస్తున్న దానంలో అక్రమంగా ఆర్జించిన సొత్తు లేశమైనా కలగలిసిపోయిందేమోనన్న భయంతో ఒకటికి రెండు సార్లు పరీక్షించుకోవాలి. అయాచితంగానో అన్యాయంగానో వచ్చి చేరిన సొత్తును కాకుండా న్యాయార్జితమైన సొమ్మునే దానం చేయాలని ధర్మ శాస్త్రం స్పష్టంగా చెప్పింది.

అన్యాయంగా సంపాదించిన ధనాన్ని దానం చేయడం అవివేకం... దానివల్ల పుణ్యఫలం, ఏ మాత్రం దక్కదు. అక్రమంగా ఆర్జించిన ధనాన్ని తెచ్చి దేవుడికిచ్చే వారంతా గ్రహించాల్సిన పరమసత్యం ఇది.

ఈ మూడింటినీ ఎరిగి, త్రికరణశుద్ధిగా దానం చేసినవారికి దానఫలం తప్పక లభిస్తుంది. చేయడానికి తగినంత స్థోమతను ఇచ్చినందుకు అల్లాహ్‌కు, స్వీకరించడానికి తగిన యోగ్యతను కలిగినందుకు దానస్వీకర్తకు- దాత కృతజ్ఞుడై ఉండాలి. అంతేకాదు, ఇచ్చాక... ఇచ్చినందుకు చింతించినా, ఇచ్చానని గర్వంగా ప్రకటించినా- దానఫలం దక్కదు సుమా!.

విశ్వాస సోదరులరా! ఓర్పు సహనాల మాసం రమజాన్. "నిశ్చయంగా సహనంతోనే సమస్య పరిష్కారం ముడి పడి ఉంటుంది" అని ప్రవక్త (స) వారు సెలవిచ్చి ఉన్నారు. స్వయంగా అల్లాహ్ 'ఓర్పు సహనాలు కలిగి ఉండమని, పరస్పరం సహనబోధ చేస్తూ ఉండాల'ని హితవు పలికాడు. అల్లాహ్ మనల్ని అనేక విధాలుగా పరీక్షిస్తాడు. భయంతో, ఆకలితో, సంపద లేమితో, సంతాన లేమితో, ఆప్తులను దూరం చేసి. ఆయన పెట్టే అన్ని పరీక్షల్లో మనం ఉత్తీర్ణులవ్వాలంటే మన వద్ద ఉన్న ఏకైక సాధనం సహనం. అలా సహనం వహించిన వారిపై ఆయన దీవెనలు అపారంగా కురుస్తాయి.

నేడు అనేక దేశాల్లో ముస్లింలు దయనీయ స్థితికి లోనయి ఉన్నారు. బతకడానికి కనీస అవసరాలకు సయితం నోచుకోకుండా తల్లడిల్లి పోతున్నారు. కొందరి కళ్ళ ఎదుటే వారి కుటుంబాలను తూటాలకు బలి చేస్తూ, ఆపాలని, వారిని కాపాడుకోవాలని మనసు ఎంత ఆరాట పడుతున్నా అడుగెత్తి అడుగు వేయలేని దీనావస్థలో ఉన్నారు పాపం! అల్లాహ్ వారందరికి ఉత్తమ సహనాన్ని ప్రసాదించాలని, వారి సమస్యలను తీర్చి వారిని గట్టున పడేయాలని, విశ్వం మొత్తంలో నివసిస్తున్న విశ్వాసుల కోసం ప్రార్థనలు చేసి ప్రగాఢ సానుభూతిని ప్రకటించాల్సిన మాసం రమజాన్. అలాగే ఆర్థిక, నైతిక సహాయంతోపాటు ఒకవేళ మన విశ్వాసాన్ని కాపాడుకునే నిమిత్తం మనపై అటువంటి ఆపదలు విరుచుకు పడినా అదరక, బెదరక ప్రాణ త్యాగం చేసైనా ధర్మోన్నతి కోసం పాటు పడతామని గట్టి సంకల్పం చేసుకోవాల్సిన మాసం. ఎందుకంటే, రమజాన్ ఓర్పు సహనాల మాసం మాత్రమే కాదు. అవి నశిస్తే సమర శర పరంపరలు సంధించే మాసం కూడా అన్న విషయాన్ని గుర్తుంచుకొని, ధర్మ సంస్థాపన కోసం ఎప్పుడు అవసరం వచ్చినా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలి. అలాంటి పోరాట పటిమ పేరే జిహాద్!

# యువతకు ఆదర్శం

## స్వంత కాళ్ళపై నిలబడే చిరు వ్యాపారులను ప్రోత్సహిద్దాం : నంద్యాల జేఐహెచ్ అధ్యక్షులు సమద్



స్వంత కాళ్ళపై నిలబడటానికి ప్రయత్నించే చిరు వ్యాపారులను ముఖ్యంగా యువతను ప్రోత్సహించాలని నంద్యాల జమాఅతె ఇస్లామీ హింద్ అధ్యక్షులు అబ్దుల్ సమద్ కోరారు. గత మాసంలో నంద్యాల ఆత్మకూర్ బస్టాండ్ కూడలిలో తన చేతులు మీదుగా మహబూబ్ ప్రారంభించిన చెరకు రసం మండి అభివృద్ధి పథంలో నడవడం పై సమద్ సందర్శించి తృప్తి వ్యక్తపరుస్తు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. స్వయం కృషి చేసేవారు బాగా రాణిస్తారని సమద్ అభిలషించారు. సంపాదనలో వ్యాపారం ఉత్తమమైనదని, అవినీతి లేని న్యాయబద్ధమైన వ్యాపారం తప్పక మన్నన పొందుతుందని మహబూబ్ కృషిని, పనితీరుని అభినందించారు. ఉపవాసం ఉండి ఎండలో ఎందరికో వేసవి తాపాన్ని తగ్గించే చెరకు రసం, నన్నారి షర్బత్ మంచి రుచి, నాణ్యత అంతకు మించి చిరునవ్వుతో అందరిని పలుకరించడం మహబూబ్ వ్యాపార రహస్యాలన్నారు.

# ఆర్థిక న్యాయానికి పునాదులు!

**- కవి కరీముల్లా**

**ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యల మూలాలు సామాజిక ఆర్థిక అసమానతల్లో ఉన్నాయనేది నిర్వివాదాంశం.** వీటికి తక్షణ పరిష్కారాలుగా సోషలిజం, కమ్యూనిజం సిద్ధాంతాలు వెలుగులోకి వచ్చాయి. వాటి విశ్లేషణ అలా ఉంచితే అవి నిర్వహించిన ఉద్యమాలు పీడిత ప్రజలకు బాసటగా నిలిచాయనడంలో సందేహం లేదు. ప్రపంచాన్ని ప్రభావితం చేసిన సోషలిస్టు సిద్ధాంత కర్తలపై ఇస్లాం ప్రభావం ఉందని నేను గట్టిగా నమ్ముతాను. రమజాన్ మాసానికున్న విశిష్టత ఏమిటంటే సామాజిక, ఆర్థిక సమానత్వ ఆచరణకు సంబంధించిన స్ఫూర్తిని ఇవ్వడం.

ఇస్లాం కలిమా, నమాజ్, జకాత్, రోజా, హజ్ అనే మూల స్థంభాలపై ఆధారపడివుంది. ఇందులో జకాత్ చాలా ప్రధాన మైనది. ఆర్థిక స్థోమత ఉన్న ప్రతి ముస్లిం తన సంపద నుండి పేదలకు జకాత్ చెల్లించాలి. ఇది దానం కాదు పేదల హక్కు అని ఇస్లాం చెప్తుంది. ఈ భావనే సోషలిస్టు భావాలకు పునాది వేసింది. "వారి సంపాదనలో పేదలకు, అవసరార్థులకు హక్కు ఉంది" అని దివ్య ఖుర్ఆన్ చెప్తుంది. ఇస్లామీయ చరిత్రలో తొలి ఖలీఫా అబూబకర్ సిద్ధిఖ్ (రజి) నిరుపేదల హక్కు ఐన జకాత్ చెల్లించని ధనిక ముస్లింలపై యుద్ధం ప్రకటిస్తానని చెప్పారు. ధనిక వర్గం సాగించే దోపిడీని ఇస్లాం అంగీకరించదు. భూమిపై, దాని లోపల ఉన్న సంపద అంతా దైవానికే చెందు తుంది. వీటిపై మనిషి తాత్కాలిక అధికారాన్ని మాత్రమే పొందాడు. కనుక ఏ మనిషి తన సంపదను తన గుత్త సొత్తుగా భావించరాదు. సమాజంలోని ధనికులు తమ సంపదలోని కొంత భాగాన్ని ఖచ్చితంగా నిరుపేదలకు పంచి తీరాలి. లేదంటే రాజ్యమే ఆ పని చేయాలి. ఒక ధనికుడు నిరుపేదల ఈ హక్కును ఇవ్వకపోతే అతని సంపద, అతని ఆత్మ ప్రక్షాళనం కావని ప్రవక్త ముహమ్మద్(స) చెప్పారు. జకాత్ వ్యవస్థ రెండు విరుద్ధమైన అతిశయాల మధ్య సంతులనాన్ని ఏర్పరుస్తుంది. నాగరికతకు పునాది కాగల శీల నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని చట్టం ద్వారాను, వ్యవస్థీకృతమైన జకాత్ అనబడే విధానం ద్వారాను పటిష్ఠ పర్చడం జరిగింది. మార్కెట్ సృష్టించే గుత్తాధిపత్యం, వడ్డీ, అదనపు రాబడి, అక్రమ నిల్వలు, జూదం ఇత్యాది వాటిని నిషేధించి సమ సమాజ భావాలకు పవిత్ర ఖుర్ఆన్ బాట వేసింది. స్వయాన ప్రవక్త ముహమ్మద్(స) "తన పొరుగున ఉన్న వారు ఆకలితో ఉండటాన్ని చూసి సహించే వ్యక్తి నిజమైన దైవ విశ్వాసి కాజాలడు" అన్నారు. ఏ వ్యక్తి తన అవసరాన్ని మించిన సంపద కూడబెట్టరాదని బోధించారు. జకాత్‌పై సమాజంలోని నిరుపేదలకు, ఆగత్యపరులకు, వితంతువులకు, వెట్టిచాకిరి విముక్తి కోరేవారికి, రుణగ్రస్థులకు, దైవ మార్గంలో శ్రమించే వారికి హక్కులుంటాయి.

ఎకనమికల్ సర్వే ఆఫ్ ఇండియా2004-05లో ఇచ్చిన నివేదిక ప్రకారం 26% దారిద్ర్యరేఖ దిగువున జీవిస్తున్నారు. ముందు ముస్లింలు తమ మధ్య ఉన్న ఆర్థిక అంతరాలను రమజాన్ స్ఫూర్తితో సామూహికంగా జకాత్ చెల్లించడం ద్వారా దూరం చేసుకోవాలి. దీనికి కొద్ది శాతమే ఉన్నా ధనిక ముస్లింలు పూను కోవాలి. సహాయం చేయడంలో కుల మత వివక్షత చూపరాదు. ప్రతి రమజాన్ మాసం మనకు ఒక కార్యాచరణ క్షేత్రం కావాలి. అప్పుడే రమజాన్ మాసం పరలోక, ప్రాపంచిక ఉద్దేశ్యాలు నెరవేరతాయి. ఎన్నో ఉదాత్తమ భావాలకు నెలవైన పవిత్ర ఖుర్ఆన్ రమజాన్ మాసంలో అవతరించడం మానవ జాతి చరిత్రలో గొప్ప మలుపు.


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ నైతిక పథకం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

37 ఆయత్‌లు

# 45. అల్ జాసియ

మక్కా అవతరణ

14 – 15 ప్రవక్తా, విశ్వసించే వారికి చెప్పివెయ్యి, ఎవరయితే అల్లాహ్ వద్ద నుండి చెడ్డ రోజులు వస్తాయన్న భయం ఏదీ కలిగిలేరో,[18] వారి చేష్టల పట్ల మన్నింపు వైఖరి నవలంబించమని, తద్వారా అల్లాహ్ స్వయంగా ఒక వర్గానికి దాని సంపాదనకు ప్రతిఫలం ఇవ్వగలగటానికి.[19] ఎవరయితే సదాచరణ చేస్తాడో తన కొరకే చేసుకుంటాడు, మరెవరయితే చెడు చేస్తాడో అతను స్వయంగా తానే దాని శాస్తిని అనుభవిస్తాడు. తరువాత చేరవలసిందయితే అందరూ తమ ప్రభువు వద్దకే.

18. మూలంలోని పదాలు **"అల్లజీన లా యర్జూన అయ్యామల్లాహి'** అన్నవి. శాబ్దిక అనువాదం, "ఎవరయితే అల్లాహ్ రోజులను ఆశించరో" అన్నది. కాని అరబీ నుడికారం ప్రకారం రోజులంటే కేవలం సాధారణ రోజులు అని అర్థం కాదు, స్మరణీయ దినాలు, ముఖ్యమయిన చారిత్రక సంఘటనలు సంభవించిన దినాలని అర్థం. ఉదాహరణకు **అయ్యాముల్ అరబ్** అన్న పదాన్ని, అరేబియా చరిత్రలోని ముఖ్యమయిన ఘట్టాలు, అరబ్బు తెగల మహా సంగ్రామాలను ప్రస్తావించడానికి ప్రయోగిస్తారు, వాటిని తరువాతి తరాలవారు శతాబ్దుల వరకు సంస్మరించుకుంటూ వచ్చారు. ఇక్కడ అయ్యాముల్లాహ్ అంటే ఉద్దేశం, ఒక జాతిలోని దుర్దినాలని, అల్లాహ్ ఆగ్రహం దానిపైకి విరుచుకుపడినప్పటి, అది తన దుశ్చేష్టల మూలంగా పూర్తిగా నాశపరచబడినప్పటి కాలమని భావం. ఈ అర్థం దృష్ట్యానే మేము ఈ వాక్యానికి అనువాదం, "ఎవరయితే అల్లాహ్ వద్ద నుండి చెడ్డరోజులు వస్తాయన్న భయం ఏదీ కలిగిలేరో" అని చేశాము. అంటే తమ ఈ చేష్టలకు శాస్తి లభించే రోజులు కూడా వస్తాయన్న ఆలోచనలేని జనులు అనీ, ఈ అలక్ష్యం కారణం గానే వారికి దౌర్జన్యం, అత్యాచారాలు చేసేందుకు ధైర్యం కలిగిందనీ భావం.

19. వ్యాఖ్యాతలు ఈ ఆయత్‌కు రెండు అర్థాలు చెప్పారు. మరి ఈ ఆయత్ పదాలలో ఈ రెండు అర్థాలూ స్ఫురించే వీలుంది. ఒకటి, విశ్వాసులు ఈ దుర్మార్గుల అత్యాచారాల ఎడల చూపోపు వహించాలి. తద్వారా వారు చూపే సహనం, సంయమనం, నిగ్రహం, సౌజన్యాలకు అల్లాహ్ వారికి తన పక్షాన సద్ఫలితం ప్రసాదిస్తాడు, దైవమార్గంలో వారు భరించే బాధలకుగాను ప్రతిఫలమూ అనుగ్రహిస్తాడు అన్నది.

రెండవది, విశ్వాసులు ఈ వర్గం పట్ల చూపోపు వహించాలి, తద్వారా అల్లాహ్ స్వయంగానే వారి అత్యాచారాలకు తగిన శాస్తి వారికి అందజేస్తాడు.

కొందరు వ్యాఖ్యాతలు ఈ ఆయత్ (ఆదేశం) రద్దయిందని అన్నారు. వారి ప్రకారం, ముస్లిములకు యుద్ధం చేసే ఆనతి ఇవ్వనంత వరకు ఈ ఆదేశం వర్తించింది. ఆ అనుమతి లభించగానే ఈ ఆదేశం రద్దయిపోయింది. కాని ఆయత్ వచనాలను పరిశీలనగా గమనిస్తే స్పష్టంగా తెలిసిపోతుంది, రద్దయిపోయిందన్న వారి వాదన సరయినది కాదని. "చూపోపు" వహించడమన్న పదం, మనిషి అన్యాయాలకు ప్రతీకారం తీర్చుకోలేని పరిస్థితుల్లో "చూపోపు" వహించాలన్న భావంలో ప్రయోగించబడదు. అటువంటి సందర్భాలలో సహనం, సంయమనం, ఓరిమి, భరించడం వంటి పదాలు ప్రయోగించబడతాయి. ఆ పదాలను వదలి ఇక్కడ చూపోపు అన్న పదప్రయోగం జరిగింది. దీనిద్వారా విశ్వాసులు ప్రతీకారం తీర్చుకునే సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ, ఈ జనుల అత్యాచారాలకు బదులు ఇవ్వడానికి దూరంగా ఉండాలన్న భావం దానంతట అదే ద్యోతకమవుతోంది. ఎందుకంటే వీరు దైవంపట్ల భయరాహిత్యం వల్ల నైతికత, మానవీయత హద్దుల్ని అతిక్రమించే సాహసం చేస్తున్నారు. ఈ ఆదేశానికీ, ముస్లిములను యుద్ధం చేసే ఆనతి ఇచ్చిన ఆదేశానికీ మధ్య ఎటువంటి వైరుధ్యం, సంబంధం లేదు. యుద్ధం చేసే ఆనతికి సంబంధించిన పరిస్థితులు వేరు. ముస్లిముల ప్రభుత్వం, ఒక తిరస్కార జాతికి వ్యతిరేకంగా నియమబద్ధంగా చర్య తీసుకునేందుకు సమంజసమయిన కారణం ఏదయినా ఉండాలి, అటువంటి పరిస్థితుల్లోనే యుద్ధంచేసే అనుమతి వర్తిస్తుంది. మన్నింపు, చూపోపు వహించే ఆదేశం సాధారణ పరిస్థితులకు వర్తిస్తుంది. వాటిలో విశ్వాసులకు దైవభయం లేని జనుల్ని ఏదో విధంగా ఎదుర్కోవలసి వస్తుంది. వారు తమ మాటల ద్వారా, వ్రాతల ద్వారా, ప్రవర్తనల ద్వారా రకరకాలుగా విశ్వాసులకు వ్యథలు కలుగజేస్తారు. ఈ ఆదేశం ఉద్దేశ్యం ఏమిటంటే ముస్లిములు తమ ఉన్నత స్థానంనుండి దిగజారి ఆ నీతిలేని జనులతో వాదులాడటానికీ, తగువులాడటానికి, వారి ప్రతి హేయమయిన చర్యకు బదులు ఇవ్వడానికి పూనుకోరాదు. సౌజన్యంతో, సామంజస్యతతో, ఏదయినా నిందకు, అభ్యంతరానికి జవాబు చెప్పడం, లేదా ఏదయినా అతిగా ప్రవర్తించినదాన్ని ఎదుర్కోవడం సాధ్యమయినట్లయితే దాన్ని వదలవలసిన పని లేదు. కాని విషయం ఈ పరిధుల్ని అతిక్రమిస్తున్నట్లు అగుపడితే అక్కడ మౌనం వహించడం ఉత్తమం. వ్యవహారాన్ని దైవానికి వదలివేయడం సరయినది. ముస్లిములు స్వయంగా వారిని ఎదుర్కొంటే, వారిని ఎదుర్కొన్నందుకు అల్లాహ్ వారిని వారి పరిస్థితులకు వదలివేస్తాడు. ఉపేక్షించి చూపోపు వహించినట్లయితే అల్లాహ్ స్వయంగా ఆ దుర్మార్గుల్ని చూసుకుంటాడు, బాధితులకు వారి నిగ్రహానికి గాను ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## సుమామా బిన్ ఉసాల్ గురించి...

**234)** హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) కొంతమంది రౌతులను నజ్ద్ క్షేత్రం వైపునకు పంపుతూ బనూ హనీఫా తెగ నాయకుడైన సుమామా బిన్ ఉసాల్‌ను బందీగా తీసుకురమ్మని ఆదేశించారు. బందీగా తీసుకు రాబడిన సుమామాను మస్జిదె నబవీలోని ఒక గుంజకు కట్టేశారు. దైవప్రవక్త(స) తన ఇంట్లో నుండి అతని వద్దకు వచ్చి, "నీ పట్ల ఎలా వ్యవహరించ మంటావ్?" అని అడిగారు. దానికి అతను, 'ముహమ్మద్! నా దగ్గర మంచి ఉన్నది. (అయినప్పటికీ) మీరు నన్ను చంపేసినట్లయితే యుద్ధ కాముకుడైన ఒక వ్యక్తిని చంపిన వారవుతారు. ఎందుకంటే అతను యుద్ధంలో ముస్లింలను చంపి ఉన్నాడు. ఒకవేళ మీరు నాకు ఉపకారం చేసినట్లయితే కృతజ్ఞతాభావం కల వ్యక్తికి ఉపకారం చేసినవారవు తారు. కాని ఒకవేళ మీకు ధనమే కావాలనుకుంటే మీకు ఎంత కావాలో చెప్పండి, ఇస్తాను' అన్నాడు. దైవప్రవక్త(స) అతని వద్ద నుండి నిష్క్రమించారు.

మరునాడు అతనికి మళ్ళీ అదే ప్రశ్న వేశారు– "సుమామా! చెప్పు, నీ పట్ల ఎలా ప్రవర్తించమంటావు?"అని. దానికి అతను, ఇంతకు ముందు చెప్పిందే చెబుతాను– 'మీరు గనక మేలు చేసినట్లయితే కృతజ్ఞతలు తెలుపుకునే వానికి మేలు చేసినట్లవుతుందని అంటాను' అన్నాడు. దైవప్రవక్త(స) మళ్ళీ తిరిగి వెళ్ళిపోయారు.

మూడవ రోజు కూడా దైవప్రవక్త(స) అతనికి అదే ప్రశ్న వేశారు– "చెప్పు, ఇప్పుడేమంటావు?" అని. దానికి అతను, 'ఇంతకుముందు అన్నదే అంటాను. ఇంకేమంటాను?' అన్నాడు. దైవప్రవక్త(స) తన సహచరులతో, "సుమామాను విడిచిపెట్టండి" అని ఆదేశించారు. (త్రాళ్ళు విప్పబడ్డాయి. అంతే) అతను మస్జిదె నబవీకి సమీపంలో ఉన్న ఒక తోటలోనికి వెళ్ళి, స్నానం చేసి మస్జిద్‌లోనికి ప్రవేశించాడు. 'అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్ (అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదని నేను సాక్ష్యమి స్తున్నాను. ముహమ్మద్ దైవప్రవక్త అని కూడా నేను సాక్ష్యం పలుకుతున్నాను)' అనే కలిమా పఠించాడు. తరువాత ఇలా అన్నాడు: 'ఓ ముహమ్మద్! దైవసాక్షిగా చెబుతున్నాను. ఈ భూమండలంలో మీ ముఖం కన్నా ఎక్కువ చెడ్డది నా దృష్టిలో మరొకటి ఉండేది కాదు. కాని ఈ రోజు నాకు మీ ముఖారవిందం కన్నా ప్రియమైనది మరొకటి లేదు. దైవసాక్షి! నా దృష్టిలో ఏ మతధర్మం కూడా మీ మతధర్మం కన్నా ఎక్కువగా ద్వేషించదగినదిగా ఉండేది కాదు. కాని ఈ రోజు మీ మతధర్మం నాకు అన్ని మతధర్మాల కన్నా ప్రియమైనది. దైవసాక్షి! నాకు ఏ నగరం కూడా మీ నగరం కన్నా ఎక్కువ చెడ్డదిగా ఉండేది కాదు. కాని ఈ రోజు మీ నగరం కన్నా ప్రియమైన నగరం నా దృష్టిలో మరొకటి లేదు. మీ సైనికులు నన్ను పట్టుకునే సమయంలో నేను ఉమ్రా సంకల్పం చేసుకుని ఉన్నాను– ఇప్పుడు తమరి ఆజ్ఞ ఏమిటో సెలవీయండి'.

ప్రవక్త మహనీయులు(స) అతనికి శుభవార్త వినిపిస్తూ ఉమ్రా చేసుకోమని సెలవిచ్చారు. సుమామా మక్కా చేరుకున్నప్పుడు ఎవరో ఒకతను, 'నీవు ధర్మభ్రష్టుడవు అయిపోయావు' అన్నాడు. దానికి సుమామా, 'లేదు. నేను ముహమ్మద్(స)తోపాటు విశ్వసించాను. దైవసాక్షిగా చెబుతున్నాను. ఇక నుంచి ముహమ్మద్(స) అనుమతి లేకుండా యమామా నుండి ఒక్క గోధుమ గింజ కూడా మీ వద్దకు చేరదు' అని కరాకండీగా చెప్పేశారు.[1]

234-1. 'నీవు ధర్మపరివర్తన చెందావా?' అని మక్కాలో కొంతమంది ఆయన్ని ప్రశ్నించారు. దానికి సుమామా, 'లేదు. నేను ధర్మపరివర్తన చెందలేదు. పైగా నేను దైవాజ్ఞాబద్ధుణ్ణి అయ్యాను' అని చెప్పారు. ఇక మీదట మక్కా వారికి ఆహార ధాన్యాలు పంపరాదని కూడా ఆయన తన తెగ వారికి ఆజ్ఞాపించారు. చివరకు మక్కా వాసులు దైవప్రవక్త(స)కు ఉత్తరం వ్రాస్తూ, "మీరు బంధువుల పోషణాభారం వహిస్తారు. రక్త సంబంధీకుల హక్కు గురించి నొక్కి వక్కాణిస్తారు. కాని సుమామా మాకు తిండిగింజలు అందకుండా కట్టడి చేశాడు" అని అభ్యర్థించారు. ఇది తెలుసుకుని దైవప్రవక్త నిలువెల్లా కరిగిపోయారు. మక్కా జనులకు ఆహార ధాన్యాలు పంపేందుకు సుమామాకు అనుమతి ఇచ్చారు- సల్లల్లాహు అలైహి వ సల్లం.

★★★



# అమెరికా ఆర్థిక సంక్షోభం ఒక గుణపాఠం

రెండవ భాగము    అనువాదం - కె.ఎం.ఎ. సుబ్‌హాన్

**(సయ్యద్ సాదతుల్లా హుసైనీ పుస్తకం "ఇఖామతె దీన్ కీ షాహ్‌రాహ్" నుంచి....)**

2011వ సంవత్సరాన్ని రెండు చారిత్రక ఘటనల విషయంగా గుర్తుంచుకోవాలి. మధ్యప్రాచ్యంలో జరిగిన మార్పులు, రెండవది పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున వీచిన అలలు. పెట్టుబడిదారీ వ్యవస్థ తన చరిత్రలో ఎన్నడూ ఎదుర్కోని సంక్షోభాన్ని ఈ కాలంలో ఎదుర్కొంది. ఈ వ్యవస్థకు మాతృభూమి వంటి దేశం లోనే దాని పునాదులు కూకటివేళ్ళతో సహా కదిలి పోయాయి. మార్పు లకు లోనయ్యాయి. ఈ వ్యవస్థ పట్ల విసుగెత్తిన అంతర్జాతీయ సమాజం, దాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించే ప్రజాపోరాటం, నిజానికి పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమ ఫలితమే. అమెరికా 90 నగరాలలోకి ఈ ఉద్యమం విస్తరించింది. యూరప్ మొత్తాన్ని ఈ ఉద్యమం ఆక్రమించింది. ప్రపంచంలోని మొత్తం 86 దేశాలలోని 951 నగరాలలో We want Global Change అనే నినాదాలు ఆకాశాన్ని అంటాయి. (Occupy protests around the world ; in the Guardian ; London ; October - 11, 2011)

ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యతిరేక ఉద్యమం కేవలం సంస్థలు, సంఘాలు, నాయకుల వరకే పరిమితం కాలేదు. ద్యూ ఫౌండేషన్ తాజా సర్వే ప్రకారం ఈ వ్యవస్థకు నాయకుడివంటి అమెరికాలోని అధిక మెజారిటీ ప్రజలు పెట్టుబడిదారీ వ్యవస్థను వ్యతిరేకిస్తున్నారు. దాని వ్యతిరేక ఉద్యమానికి మద్దతుదారులుగా ఉన్నారు. (Occupy wall strect's Taps in to Long standing concerns ; in Newyork Times - 18.10.2011 By Andrew Kohut) టైమ్ మ్యాగజైన్ ప్రకారం ప్రస్తుతం అమెరికా ప్రజలు పెట్టుబడీదారి ఆర్థిక వ్యవస్థ పట్ల విసుగెత్తి ఉన్నారు. అమెరికా చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున ఈ వ్యవస్థను వ్యతిరేకించడం గతంలో ఎప్పుడూ జరగలేదు. (What is occupy? Newyork - 2011 - Time Magazine)

ప్రజల సంగతి సరే సరి. మరి ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ సమర్థకులైన సిద్ధాంత కర్తలు ప్రభుత్వాధినేతలు సైతం ఈ వ్యవస్థ ఓటమిని అంగీకరించక తప్పలేదు. గత మూడేళ్ళలో ముప్పై వేల అరబ్ డాలర్లు పెట్టుబడులు నష్టపోయాయి. లెహ్‌మన్ బ్రదర్స్ ఎ.ఐ.జి. లాంటి సంస్థలు పెట్టుబడిదారీ వ్యవస్థకు గర్వకారణంగా ఉండేవి. ఇప్పుడు అవి చూస్తుండగానే పతనపు అగాధాలకు చేరుకున్నాయి. పాశ్చాత్య సంస్కృతికి అతి పురాతన ప్రతినిధి అయిన గ్రీకుదేశం దివాలా తీయడం నేడు మనం గమనించాం. దీనిని చక్కబర్చే ఎటువంటి మార్గమూ కనపడటం లేదు. గార్డెన్ బ్రౌన్ లాంటి నిష్ణాతులైన మేధావులు సైతం ఆర్థిక సంస్కరణల విషయంలో పెదవి విరిచే స్థితికి చేరుకున్నారు. పూర్తి వ్యవస్థను మార్చివేయాలని సూచిస్తున్నారు. (Financial crisis ; Gorden Brown calls for new Bretton woods ; in the Telegraph. October -

14 - 2008) "We must creat a new international financial architechture for the global age. We must have a new Bretton woods".

ఈ పరిస్థితి ఎలా సంభవించింది? అనే విషయంపై మనం విశ్లేషణ చేయడం తప్పనిసరి అవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ, అంతులేని అభివృద్ధిని కోరుతుంది. ఈ అభివృద్ధి కొరకు అది ప్రజలను అప్పులపాలు చేస్తుంది. వినిమయతత్వం అలవరుస్తుంది. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ లక్షణం. ఈ వ్యవస్థ అభివృద్ధి కొరకు ఇది తప్పనిసరి కూడా. ఇందుకోసం ఈ వ్యవస్థ ప్రజలలో అంతులేని కోరికలు జనింపచేస్తుంది. దుబారా ఖర్చు అలవరుస్తుంది. ఈ వ్యవస్థ ప్రారంభ దేశమైన అమెరికాలో, ఈ వ్యవస్థ మానసికతకు లోనైన ప్రజలు అనవసర ఖర్చు చేయడానికి అలవాటు పడ్డారు. ఒక సర్వే ప్రకారం ఈ దేశంలోని 72% కుటుంబాలు తమ ఆదాయం కంటే అధికంగా ఖర్చు చేసేవిగా నిరూపించబడ్డాయి. ఫలితంగా షుమారు నాలుగు లక్షల కుటుంబాలు దివాలా తీశాయి.

ఈ అతి దుబారా ఖర్చు నుండి లబ్ది పొందేందుకు అనేక బ్యాంకులు ఉనికిలోకి వచ్చాయి. ఇవి ప్రజలకు సులభంగా అప్పులు అందించే ఏర్పాట్లు చేశాయి. ఈ రుణ మంజూరుల బజారు Saturate స్థితికి చేరినప్పుడు, బ్యాంకులు సాధారణ పేద ప్రజానీకంలో ఇల్లు, దాని కొరకు రుణం తీసుకునే కోరికను విపరీతంగా పెంచాయి. ఈ పేదలకు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకుల ద్వారా అధికవడ్డీపై, అదనపు అప్పులు (Sub Prime) ఇవ్వడం మొదలెట్టాయి. ఈ అప్పుల కోసం, రొఖ్ఖాలు పొందేందుకోసం, అత్యంత సంక్లిష్టమైన (పేచీలతో కూడిన) ఉత్పత్తులు ఉదా॥ CDO's ప్రారంభించబడ్డాయి. ఈ అప్పులపై వడ్డీ, మళ్ళీ అప్పులు, మళ్ళీ వడ్డీ, అప్పులపై అప్పులు Debt Trading లను మొత్తం సిస్టంలో ప్రబలింపచేశారు. ఈ అప్పులకు పెద్ద పెద్ద కంపెనీల ద్వారా భీమా కూడా చేయించారు.

సులువుగా దొరుకుతున్న రుణాలతో గృహనిర్మాణాల పని జోరందుకుంది. ఇండ్ల డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఫలితంగా ఇళ్ళ కొనుగోళ్ళు వాటి విలువలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ అవసరాలను తీర్చేందుకు లెక్కలేనన్ని అపార్ట్‌మెంట్లు నిర్మించబడ్డాయి. ఇది విపరీత స్థితికి చేరుకొని ఇండ్లు ఎక్కువైపోగా, కొనేవారి సంఖ్య తగ్గిపోయింది. ఈ తాత్కాలిక బబుల్ ఒక్కసారిగా పేలిపోయింది. ఫలితంగా ఇండ్ల ధరలు విపరీతంగా పడిపోయాయి. ప్రజలు తమ రుణాలు తీర్చలేని స్థితికి చేరుకున్నారు. ఫలితం – మొట్టమొదట బ్యాంకులు మునగడం ప్రారంభించాయి. ఆపై భీమా కంపెనీలు దివాలా తీశాయి. వీటిని కాపాడేందుకు ప్రభుత్వం 'బెల్ అవుట్'కు అనుమతినిచ్చింది. కేవలం ఒక్క అమెరికాయే తన దేశంలోని పెద్ద పెద్ద బ్యాంకులను రక్షించేందుకు పద్నాలుగు ట్రిలియన్ డాలర్లు అందించింది. పూర్తి ఆర్థిక వ్యవస్థ కుదేలై కూర్చుంది.

ఈ శాపం క్రమంగా యూరప్‌ను కూడా ప్రభావితం చేసింది. ఇక్కడ కూడా అత్యధికంగా వినిమయతత్వం పెరిగింది. యూరప్ ఏకీకరణ – యూరోకరెన్సీ ఏర్పాటు తర్వాత జర్మనీ వంటి పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ గల దేశాలు, గ్రీకు, పోర్చుగల్ వంటి బలహీన దేశాల ద్వారా అత్యధికంగా లబ్దిని పొందాయి. ఈ దేశాలకు సులువుగా రుణం దొరకడం మొదలయ్యింది. తద్వారా పూర్తిగా లబ్ది పొందడం జరిగింది. పెట్టుబడిదారీ వ్యవస్థకు అసలు ఆత్మగా 'దుబారా ఖర్చు' ఉపయోగపడుతుంది. ఈ స్థితి పెరిగి పెరిగి గ్రీకు దేశపు బయటి రుణాలు, దాని జీడీపీ కంటె, 250 రెట్లు అధికమయ్యాయి. ఒకానొక సమయం ఇక ఎంత మాత్రమూ రుణం పొందే అవకాశంలేని స్థితి వచ్చింది. గ్రీకుదేశపు ఆర్థిక స్థితి ఒక్కసారిగా కుదేలై పోయింది. ఈ ఆర్థికమాంద్యపు తాకిడి మొత్తం యూరప్‌ను కుదిపివేసింది. ఇప్పుడు యూరో కరెన్సీ ఉనికికే ప్రమాదం ఏర్పడి ఉంది.

ఇది మొత్తం ఆర్థిక మాంద్యంపై క్లుప్తమైన వివరణ. ప్రస్తుతం అమెరికా మొత్తం ఖర్చులు దాని ఆదాయం కంటె అరవై శాతం అధికంగా ఉన్నాయి. జార్జ్ వాషింగ్‌టన్ కాలం నుండి మూడు సంవత్సరాల ముందువరకు ఎంతటి అప్పులు అమెరికా చేసిందో – అంతకంటే అధికంగా గత మూడేళ్ళలో అమెరికా అప్పులు చేసింది. అమెరికా సాంవత్సరిక ఆదాయం ప్రతిఏటా ఏడు శాతం తగ్గిపోతూ ఉంది. యూరప్‌లో ఈ స్థితి మరీ దయనీయంగా ఉంది. గ్రీస్ దివాలా తీసింది. ఇటలీ దివాలా తీసేందుకు సిద్ధంగా ఉంది. ఐర్లాండ్ ఖర్చులు దాని ఆదాయంతో పోలిస్తే పదింతలు పెరిగింది. అనగా వేయి శాతం పెరిగింది. ఇప్పుడు అమెరికా, యూరప్ దేశాలు మొత్తంగా చరిత్రలో ఎన్నడూ ఎదుర్కోని ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ పాశ్చాత్య దేశాలకు ఆసియాఖండపు జపాన్, చైనా దేశాలు కూడా రుణాలు అందించి వున్నాయి. ఫలితంగా పరోక్షంగా ఈ దేశాలు కూడా ఈ ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కొని పోయాయి.

ఒకవైపున ఈ ఆర్థిక సంక్షోభం, పూర్తి ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది. కోట్లాది పేద ప్రజల జీవితాలను మరింత దుర్భరం చేసి వేసింది. మరో వైపున బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు పూర్తి ఆర్థిక వ్యవస్థను దోపిడీ చేసుకొని, తాము సృష్టించిన విధ్వంసానికి ప్రభుత్వం నుండి 14 ట్రిలియన్ డాలర్లను వసూలు చేసుకొని జల్సా చేస్తున్నాయి. ఏ పెట్టుబడిదారీ విధానం, పేదలకు సబ్సీడీలలో ఫ్రీ మార్కెట్‌లలో చొరబడి వాటి మూలాలను వ్యతిరేకించిందో అదే

వ్యవస్థ మొత్తం దేశ ఆర్థిక బడ్జెట్ కంటె ఎక్కువగా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల రక్షణకు ఖర్చు చేసింది. ఈ సంక్షోభ కాలంలోనే సంస్థల సి.ఇ.ఓ.ల సాలుసరి జీతాలు వంద మిలియన్ డాలర్లు వరకు పెరిగాయి. ఇక దాల్ మార్కెట్ స్థాపకుల మధ్య పంచుకోబడిన సంపద మొత్తంగా అమెరికా మొత్తం సంపద కంటె 30 శాతం అధికంగా ఉండింది. (United states ; Congress House energy recognization act of 1973, Hearings ; Ninty third Congress , first session on. H.R. 11510.1973 Page - 243 By Kenneth Boulding.)

ఈ ఆర్థిక సంక్షోభం గురించి ప్రస్తుతం ఇంతకన్నా ఎక్కువ చర్చించే అవకాశం లేదు. ఈ ఆర్థిక విధ్వంసానికి, సంక్షోభానికి అసలు కారణం ఏమిటి? అనేదే అసలు ప్రశ్న. ఇది అనుకోకుండా జరిగిన ఒక హఠాత్ సంఘటనయా? లేక సాధారణంగా సంభవించే సంక్షోభమా? లేక పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ ఫలితమా? అనేక మంది ఆర్థిక మేధావులు ఈ సంక్షోభాన్ని, మాంద్యాన్ని అత్యంత తేలికగా కొట్టివేసే ప్రయత్నం చేస్తున్నారు. అసలు నిజాలను కంటికి కనపడకుండా చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అసలు విషయం ఏమంటే ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్య ఫలితంగానే జరిగింది. ఈ విషయాన్ని ఈ వ్యవస్థకు కాపుదలకాసే ఆర్థిక నిపుణులే నేడు అంగీకరిస్తున్నారు.

మరి ఈ ఆర్థిక సంక్షోభం, మాంద్యాలకు కారణాలేమిటి? మనిషి అతని వనరులు, అవసరాలు అన్ని పరిమితమైనవి కాగా, పెట్టుబడి దారీ వ్యవస్థ సహజంగానే అంతులేని అభివృద్ధిని కాంక్షి స్తుంది. అది దాని సహజ నైజంగానూ ఉంది. అమెరికాలోని కెన్నెత్ బోల్డింగ్ అనబడే ఆర్థిక నిపుణుడు ఈ విషయంగా ఒక నిజం చెప్పాడు. 'ఎవరైనా ఈ పరిమితమైన ప్రపంచంలో అత్యంత శీఘ్రమైన, నిత్యం సాగే అంతులేని అభివృద్ధి గురించి మాట్లాడితే అతడు పిచ్చి వాడైనా అయివుంటాడు లేకుంటే పచ్చి ఆర్థికవేత్త అయినా అయి వుంటాడు'.

Any one who believes exponential growth can go on forever in a finite world is either a mad man or an economist.

ఈ సంక్షోభానికి మూడు ప్రధాన కారణాలున్నాయి. (1) అంతులేని అత్యాశ (హవస్), లేక కోరికలు, స్వార్థం, ఖర్చు చేయడంలో అసంతులన విధానం, (2) వడ్డీ, వడ్డీతో కూడిన రుణాలు. ఈ రుణాల పై రుణాలు. ఆ రుణాలపై చక్రవడ్డీలు. ఈ వడ్డీ మొత్తం వ్యవస్థలో సర్వసాధారణమై విస్తరించడం, (3) అసంబద్ధ ఆర్థిక ఒప్పందాలు, భవిష్యత్తు వ్యాపారాలు, వాస్తవాలపై ఆధారపడని ఆర్థిక లావాదేవీలు.

పై మూడు అంశాలు కూడా ఇస్లాంకు పూర్తి భిన్నమైనవి. ఇస్లాం పై మూడు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతుంది. పై మూడు విషయాలు కూడా మనసును తాకేవిగానూ, అందులో అల్లాహ్ సంజ్ఞలు కూడా దాగి వున్నాయి. ఈ సంజ్ఞలు, అటు అల్లాహ్ తిరస్కారులకునూ, అల్లాహ్ విధేయులకునూ హెచ్చరికల వంటివే. ఖర్చులో సమతుల్యత పాటించడం ఇస్లాం సాంప్రదాయంలో ఒక భాగం. ఇది మనందరికీ ఆచరణ యోగ్యం కూడా. ఇక అప్పుల విషయంగా ఇస్లాం దానిని సమర్థించదు. ఇప్పటి అమెరికా, మొత్తం యూరప్ హజ్రత్ ఉమర్ (రజి) గారి హెచ్చరికకు తగినవిగా ఉన్నాయి. 'అప్పు నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి! అది ఆందోళన (పరేషాన్)తో ప్రారంభమై యుద్ధం, తగాదాలతో ముగుస్తుంది' అని ఆయన (రజి) హెచ్చరించారు. (ఇమామ్ మాలిక్, మూతా)

ఇదే విధంగా వడ్డీలేని వ్యాపారం, వడ్డీ లేని లావాదేవీలను ఇస్లాం సూత్రబద్ధంగా అందించింది. ఈ విధానాన్ని స్వీకరించి ఉంటే, నేటి ఈ ఆర్థిక మాంద్యపు దుస్థితి దాపురించేది కాదు. ఈ విషయాన్ని నేడు జ్ఞానవంతంగానూ, వివేకవంతంగానూ, హేతుబద్ధంగానూ, శాస్త్రీయంగానూ సులువుగా అర్థం చేయించగలం, రుజువు చేయగలం కూడా.

ఇదే విధంగా ఇస్లాం రుణానికి బదులుగా రుణం అనే విధానాన్ని రద్దు చేసింది. దైవప్రవక్త(స) ఈ విధానానికి స్వస్థి పలకమని హెచ్చరించారు. (సునన్ ఖుత్నీ). ఈ సంక్షోభానికి స్వయంగా సదరు వ్యవస్థకు చెందిన ఆర్థిక నిపుణులే, ఈ అప్పులను తీర్చేందుకు. మరలా అప్పులు ఇవ్వడం అనే పద్ధతినే కారణంగా చూపారు. Debt Trading రూపంలో జరిగిన ఈ విధానం పూర్తి ఆర్థిక వ్యవస్థలో అమలు చేయబడింది. ఈ కారణంగా రుణాలు అప్రయోజన కారకాలుగా మిగిలిపోయాయి. మొత్తం వ్యవస్థ కుదేలై కూర్చుంది.

ఇదే విధంగా సట్టా బాజార్ (జూదం లాంటి వ్యాపారం) అనే నేటి ఆధునిక వ్యాపారం అనేక పేచీలతో కూడినదిగానూ Derivatives, Swaps, Futures, Options వగైరాల పేర్లతోనూ, ప్రారంభించబడ్డాయి. వీటిని వారన్ బఫెట్ స్వయంగా ఆత్మహత్యా ఆయుధాలుగా పేర్కొన్నాడు. *Economic weapons of mass destruction. (Warren Buffect-In Berkshire Hathaway annual report for 2002, letters pdf. retrived on 31.12.2017)*

ఇస్లామీయ ఆర్థికవేత్తలు ఏ విషయాల గురించి హెచ్చరిస్తూ పోరాడుతూ వచ్చారో వాటిని నేడు పాశ్చాత్య ప్రపంచం ఆమోదం తెలుపుతుంది. ఈ సంక్షోభానికి పెట్టుబడిదారుల హస్తాలు పనిచేశాయని అంగీకరిస్తున్నాయి. ✤

'చరితార్థులు'-2



# బేగం సకీనా లుఖ్మాని

## (1865 -1960)

75




**భారత స్వాతంత్ర్యోద్యమంలో** ప్రధాన పాత్ర వహించిన తయ్యాబ్జీ కుటుంబానికి చెందిన బేగం సకీనా లుఖ్మాని 1865 ప్రాంతంలో గుజరాత్ రాష్ట్రంలో జన్మించారు. ఆమె భారత జాతీయ కాంగ్రెస్ తొలినాటి సమావేశాలకు అధ్యక్షత వహించిన ప్రముఖుడు జస్టిస్ బద్రుద్దీన్ తయ్యబ్జీ కుమార్తె. బద్రుద్దీన్ తయ్యబ్జీ గృహంలో ఎల్లప్పుడు విలసిల్లుతున్న రాజకీయ వాతావరణం ప్రభావంతో ఆమె జాతీయోద్యమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. 1930లో మహాత్ముడి పిలుపు మేరకు గుజరాత్‌లో సాగిన విదేశీ వస్తు బహిష్కరణ, మద్యపాన నిషేధ ఉద్యమాలలో 65 సంవత్సరాల వయస్సులో ఆమె క్రియాశీలక పాత్ర వహించారు. ఈ ఉద్యమంలో భాగంగా విదేశీ వస్తువుల విక్రయశాలలు, మద్యపానశాలల ఎదుట మండుటెండలను సైతం లెక్క చేయక ఆమె పికెటింగ్‌లు నిర్వహించారు. గుజరాత్‌లో విదేశీవస్తు బహిష్కరణకు, మద్యపాన విక్రయశాలల వద్ద పికెటింగ్ కార్యక్రమాలకు ప్రేరణగా నిలిచారు. శాంతి భద్రతలకు భంగం కలిగించారన్న నేరారోపణతో ఆమెను అరెస్టు చేసి ప్రభుత్వం నాలుగు మాసాల కఠిన కారాగార శిక్ష, వంద రూపాయల జరిమానా విధించింది. ఈ వార్త ప్రజలలో ఆగ్రహావేశాలను రగిలించింది. ప్రజల డిమాండ్‌కు బ్రిటిష్ ప్రభుత్వం తలొగ్గిన ఆంగ్ల ప్రభుత్వం. బేగం సకీనా లుఖ్మాని అభ్యర్థించినట్టయితే శిక్షను తగ్గించగల అవకాశాలను పరిశీలిస్తామని ప్రకటించింది. ఆమె మాత్రం ప్రభుత్వం కోరినట్టుగా శిక్ష రద్దు అభ్యర్థనకు నిరాకరించారు. ఆ సందర్భంగా అమ్మను నిరోధిస్తే ఆమె ఆరంభించిన కార్యక్రమాలను కొనసాగించడానికి మేమున్నాం. మమ్మల్ని కూడా అరెస్టు చేయండి. మాకూ శిక్షలు విధించండి, అంటూ గుజరాత్ యువత భారీ సంఖ్యలో వీధుల్లోకి వచ్చింది. ప్రజల నిరసన దృష్ట్యా ఆంగ్ల ప్రభుత్వం దిగివచ్చి ఆమెకు విధించిన కఠిన జైలు శిక్షను సాధారణ జైలుశిక్షగా మార్చింది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ 'తయ్యబ్జీ పరివార సభ్యులు అసాధారణ ధైర్య సాహసాలను ప్రదర్శించారు' అంటూ మహాత్ముడు ప్రశంసించారు. జాతీయోద్యమంలో భాగంగా మద్యపాన నిషేధం కోరుతూ గుజరాత్ రాష్ట్ర మహిళలు వైశ్రాయ్‌కు రాసిన చారిత్రాత్మక లేఖ మీద బేగం సకీనా లుఖ్మాని సంతకం చేశారు. గాంధీజీని బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టుచేయగా గుజరాత్‌లో మహిళలతో భారీ సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రభుత్వ వైఖరిని ఆమె తీవ్రంగా విమర్శించారు. స్వాతంత్ర్యం సిద్ధించాక దేశం రెండుగా చీలిపోవటం పట్ల తీవ్ర వ్యాకులత చెందిన బేగం సకినా లుఖ్మాని రాజకీయాలకు దూరంగా ఉంటూ, 1960 ఫిబ్రవరి 6న కన్నుమూశారు.



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

✤

డా॥ హకీం ముహమ్మద్ జఫర్, ఎం.డి (యునాని)

# ఆరోగ్యవంతమైన సహరీ, ఇఫ్తార్



**ముహమ్మద్ ప్రవక్త(స)** ప్రకారం సహరీ 'శరీరానికి సంబంధించిన జకాత్'. ఇతరుల ఉపవాసాలలో సహరీ వ్యత్యాసం ఉంటుంది. ఇతరులు సహరీ చేయరు. ముస్లిములు తప్పకుండా సహరీ చేయవలసి ఉంటుంది.

సూర్యాస్తమయం నుండి సూర్యోదయం వరకు అంటే సాయంత్రం 6:30 గంటల నుండి ఉదయం 4:30 వరకు దాదాపు 9 గంటల సమయం ఉంటుంది. ఈ 9 గంటల సమయాన్ని ఆరు భాగాలుగా విభజించాలి. ఈ ఆరు భాగాలలో చివరి భాగంలో సహరీ చేయవలసి ఉంటుంది. రాత్రి 12 గంటలకు, ఒంటి గంటకు తిని పడుకోవడాన్ని సహరీ అనరు. సహరీ సమయం ఉదయం 2:00 గంటల నుంచి 4:30 మధ్యలో ఉంటుది. కాలాన్నిబట్టి ఈ సమయం కొద్దిగా మారవచ్చు. ఈ సమయంలోనే ఆహారం తీసుకోవడం ఆరోగ్యపరంగా కూడా సరైన పద్ధతి.

మనలో చాలామంది సహరీలో ఏమి తినాలో, ఏమి తినకూడదో, ఏమి తింటే రోజు ఎలా గడుస్తుందో అని చాలా తికమకగా ఉంటారు. నిజానికి మనం రోజు తీసుకునే నార్మల్ బ్రేక్‌ఫాస్ట్ (టిఫిన్) మాదిరిగానే తీసుకోవాలి. రోజూ హెల్తీ టిఫిన్ ఎలా చేస్తామో అలాగే చేయాలి. వ్యత్యాసం ఏమిటంటే శక్తినిచ్చే ఆహార పదార్థాలు, దాహాన్ని నియంత్రించే ద్రావకాలు తీసుకోవాలి.

ముస్నదె అహ్మద్ 11306 హదీసు ప్రకారం సహరీ పూర్తిగా బర్కత్‌తో నిండి ఉంటుంది. అంటే శుభాలతో నిండి ఉంటుంది. దీనిని వదలకండి. ఒక గుటక నీళ్లు తీసుకున్నా చాలు. అల్లాహ్, దైవదూతలు మీపై కారుణ్యాన్ని కురిపిస్తారు అని ముహమ్మద్ ప్రవక్త(స) అన్నారు. ఈ హదీసుల్లో స్పష్టంగా అర్థమయ్యే విషయం ఏమిటంటే సహరీ పూర్తిగా శుభప్రదమైనది. కావున దీనిని ఖచ్చితంగా తీసుకోవలసి ఉంటుంది.

చాలామందికి ఉదయం బద్ధకం ఎక్కువగా ఉంటుంది. నిద్ర నుంచి లేవగానే తినడానికి మనస్సొప్పదు. కొందరు సహరీ తినకుండా ఉపవాసం ఉండడానికి ప్రయత్నిస్తారు. ఇది ఆరోగ్య రీత్యా మంచి విషయం కాదు. మరికొందరు కేవలం ఖర్జూరం, నీళ్ళు తీసుకుని ఉపవాసం ఉంటారు, అలా చేయరాదు. ఆరోగ్యకరమైన సహరీ అంటే ఉపవాసం ఉండడానికి శక్తిని, బలాన్నివ్వడమే కాకుండా మన ఆరోగ్యాన్ని కాపాడుతూ రోజువారి పనులతోపాటు నమాజ్ చేయడానికి సహకరించేది.

ముహమ్మద్ ప్రవక్త(స) ప్రకారం సహరీలో తీసుకునే అత్యుత్తమ ఆహారం ఖర్జూరం. ఖర్జూరం సహరీలో తీసుకోవడంచాలా ఉత్తమం. అది ఎలాగైనా తీసుకోవచ్చు. 3,5,7 ఖర్జూరాలను రాత్రి నీటిలో నానబెట్టి ఉదయం నీటితోపాటు ఖర్జూరాలను తినాలి. ఇంకో పద్ధతి ఇలా నానబెట్టిన ఖర్జూరాలను మిక్సీలో వేసి జ్యూస్‌గా తయారు చేసుకుని దానిని తాగాలి. రోజంతా పోషక విలువలు మనకు లభిస్తాయి.

నిద్రలేచిన వెంటనే రెండు గ్లాసులు నీళ్ళు తాగాలి. ఎండలో పనిచేసే వారు, శారీరక శ్రమ అధికంగా ఉండేవారు నీరు ఎక్కువగా తాగవచ్చు. అందరూ ఎక్కువగా నీళ్ళు తాగవలసిన అవసరం లేదు. సహరీలో చేసే మరో తప్పు ఎక్కువగా నీళ్ళు తాగడం. సహరీలో ఆహారం ఆలస్యంగా తినడం, సమయం ముగుస్తుందని వెంటనే టీ/కాఫీ తాగి ఆపై రెండు, మూడు గ్లాసులు నీళ్ళు తాగుతారు. ఇలా చేయడం వల్ల ఛాతిలో మంటగా వుండి తేన్పులు రావడం, వాంతులు రావడానికి అవకాశం ఉంది. కావున సహరీ సమయం ముగిసే 15 నిమిషాల ముందే ఆహారం తీసుకోవడం ముగించి చివరిలో నీళ్ళు తాగడం ఉత్తమం.

70–80 శాతం మందికి రోజంతా ఉపవాసం ఉంటామని ఆహారం ఎక్కువగా తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులు వస్తాయి. శారీరక శ్రమ చేసేవారు సహరీలో ఎక్కువగా తిన్నా, వారు దానిని జీర్ణం చేసుకుంటారు. వారికి ఎటువంటి సమస్య ఉండదు. మరికొంతమంది ఫజర్ నమాజ్ తరువాత పడుకునేవారికి అసిడిటి సమస్య ఎక్కువగా ఉంటుంది. మరికొందరు రాత్రంతా మేల్కొని గేమ్స్ ఆడటం, తిరగడం చేసి బయట హెూటళ్లలో సహరీ చేసి వెంటనే నిద్రపోతారు. అటువంటి వారికి కూడా అసిడిటి సమస్య ఎక్కువగా ఉంటుంది. వేసవి కాల ఉపవాసాలలో వేపుళ్ళు, మసాలలతో చేసిన కూరలు, పచ్చళ్లు ఎక్కువగా తినకపోవడం మంచిది. ఇవి దాహాన్ని కలిగిస్తాయి.

సాధ్యమైనంత వరకు టీ/కాఫీలను తీసుకోరాదు. యాలకులు వేసిన గ్రీన్ టీ తాగడం ఉత్తమం. టీ/కాఫీలు మూత్రాన్ని ఎక్కువగా కలిగిస్తాయి. తద్వారా శరీరంలో నీటిశాతం తగ్గి డీహైడ్రేషన్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

డైటీషియన్ ప్రకారం కార్బోహైడ్రేట్స్ మన శరీరంలో ప్రతి యాక్టివిటీ చేయడానికి ఉపయోగపడతాయి. కార్బోహైడ్రేట్స్ Sole energy provider కూడా చెప్పుకోవచ్చు. ఈ కార్బోహైడ్రేట్స్ ముఖ్యంగా రొట్టె, అన్నం, నూడుల్స్, బ్రెడ్ వంటి వాటి నుండి దొరుకుతాయి. ప్రొటీన్స్ మటన్, చికెన్, ఫిష్, బీఫ్‌లో దొరుకుతాయి. ఫ్యాట్స్ పాలు, పెరుగు లాంటి డైరీ ప్రొడక్ట్స్ నుండి దొరుకుతాయి. ఏదైనా ఒక ఫ్రూట్, రెండు లేదా మూడు ఖర్జూరాలు తీసుకోవాలి. ఇటువంటి సహరీ అన్ని పాళ్లలో సమతుల్యమైన ఆరోగ్యకరమైన సహరీగా చెప్పుకోవచ్చు.

## ఆరోగ్యవంతమైన ఇఫ్తార్

14–16 గంటల ఉపవాసం తర్వాత శరీరం తిరిగి పునరుత్తేజం పొందడానికి సూర్యాస్తమయ సమయంలో తీసుకునే ఆహారాన్ని 'ఇఫ్తార్' అంటారు. ఇఫ్తార్‌ను ఎలా తీసుకోవాలో ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం. హాస్పిటల్స్‌లో ఎవరికైతే ఆపరేషన్ చేయాలనుకుంటారో అటువంటి వారికి 12 గంటల ముందు Nothing by mouth (NBM) ఉంచుతారు. అంటే 12 గంటల ముందు నుండి వారు ఏమి తినకూడదు, తాగకూడదు. ఆ తర్వాత ఆపరేషన్ చేస్తారు. ఆపరేషన్ చేసిన 5,6 గంటల తర్వాత ముందుగా కొద్దిగా వేడి పాలు/ కాఫీ ఇస్తారు. ఆ తర్వాత స్వల్ప ఆహారమైన బ్రెడ్/ఇడ్లీ లాంటి త్వరగా జీర్ణం అయ్యే పదార్థాలు ఇస్తారు. కొన్ని గంటల తర్వాత లేదా ఒక రోజు తర్వాత అన్నం లాంటివి ఇవ్వడం జరుగుతుంది. ఇదే విధానం ఇఫ్తార్‌లో పాటించవలసి ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జీర్ణ వ్యవస్థ పూర్తిగా విశ్రాంతిలో ఉంటుంది. కాబట్టి మనం తీసుకునే ఆహార పానీయాలు చాలా ప్రభావం చూపుతాయి.

ముహమ్మద్ ప్రవక్త(స) ఖర్జూరం లేదా నీటితో ఇఫ్తార్ చేసేవారు. 14–16 గంటల ఉపవాసం వల్ల శరీరంలో గ్లూకోజ్ లెవెల్స్ చాలావరకు తగ్గిపోయి, శరీరంలో అలసట ఉంటుంది. అటువంటప్పుడు, ఖర్జూరం తినడం వల్ల ఇది వెంటనే జీర్ణమై శరీరంలో గ్లూకోస్ లెవల్‌ను త్వరగా పెంచడం ద్వారా త్వరగా బలం చేకూరుతుంది. ముందుగా కొద్దిపాటి నీళ్ళతో ఒకటి లేదా రెండు ఖర్జూరాలతో ఇఫ్తార్ చేయాలి. ఆ తరువాత ఫ్రూట్స్/ ఫ్రూట్ జ్యూస్ తీసుకోవచ్చు.

అలాగే మైదా పిండితో చేసిన పదార్థాలు, సమోసాలు, పకోడీలు, మిర్చీలు, బజ్జీలు తినకపోవడం మంచిది. రోజు కాకుండా అప్పుడప్పుడు తినవచ్చు.

నీటికి బదులు కూల్‌డ్రింక్స్‌తో ఇఫ్తార్ చేయడం వల్ల, శరీరంలో కిడ్నీలు పాడైపోయే ప్రమాదం ఉంటుంది. ఎందుకంటే 14,15 గంటల ఉపవాసం తర్వాత శరీరంలో నీటిశాతం తగ్గిపోతుంది. కనుక నీరు తీసుకోవడం తప్పనిసరి.

చక్కెరతో చేసిన షర్బతులు తాగరాదు. ఎందుకంటే వీటిని తీసుకోవడం వల్ల ఇవి వెంటనే రక్తంలో కలిసి శరీరంలో షుగర్ లెవల్స్ అమాంతంగా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

సాధారణంగా మన శరీర ఉష్ణోగ్రత 37సి ఉంటుంది. శరీరం లోపలి అవయవాలు ఉష్ణోగ్రత దాదాపు దీనికి దగ్గరగా ఉంటుంది. అటువంటప్పుడు ఫ్రిజ్‌లోని చల్లటి నీటిని తాగడం వల్ల కడుపులోని వాతావరణం అందుకు సహకరించదు. జీర్ణ క్రియకు అవసరమయ్యే ఆమ్లాలు ఉత్పత్తి కావు. కొద్దిగా చల్లగా ఉన్న కుండ నీరు తాగవచ్చు. మార్కెట్లో దొరికే రంగురంగుల డ్రింక్స్, ఉచితంగా దొరికినా త్రాగరాదు. దీంతో కొన్ని రకాల ఫుడ్ కలర్స్‌ను ఉపయోగిస్తారు, అవి శరీరానికి హానికరం.

అల్లాహ్ ప్రకృతిలో సృష్టించిన సహజసిద్ధ ఫలాలు, పండ్ల రసాలు ఉన్నాయి. వాటిని తీసుకోవడం చాలా మంచిది. ముఖ్యంగా గర్భవతులు, ముసలివారు ఫ్రూట్ జ్యూస్ తీసుకోవడం ఉత్తమం. అవి త్వరగా శరీరానికి శక్తినిస్తాయి.


షుగర్ పేషంట్లు 1,2 ఖర్జూరాలు తినవచ్చు, ఇఫ్తార్ నుంచి నిద్రపోయే ముందు వరకు కొద్దికొద్దిగా నీరు తాగుతూ ఉండవచ్చు.

వేయించిన చికెన్, మటన్, కబాబ్‌లు, పీజ్జా, బర్గర్ లాంటివి ఇఫ్తార్ సమయంలో తీసుకోరాదు. తర్వాత రాత్రి భోజనం సమయంలో తీసుకోవచ్చు.

ఫ్రూట్‌చాట్‌లు ఈ మధ్యకాలంలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈ ఫ్రూట్ చాట్‌లో ఉప్పు, చక్కెర, చాట్ పౌడర్ కలుపుతారు. బీపీ ఉన్నవారు ఉప్పు విషయంలో, షుగర్ ఉన్నవారు చక్కెర విషయంలో ఆచితూచి వ్యవహరించవలసి ఉంటుంది. ఈ మధ్య కాలంలో మన తెలుగు రాష్ట్రాలలో హలీం, హరీస్ కల్చర్ ఎక్కువగా పెరుగుతున్నది. వీటిని రోజు కాకుండా అప్పుడప్పుడు తినవచ్చు.

ఇఫ్తార్ తర్వాత మత్తుగా, బలహీనంగా ఉండడానికి కారణం మనం తీసుకునే ఆహారం. ఆలస్యంగా జీర్ణం అయ్యే పదార్థాలు తింటే శరీరం వాటిని జీర్ణం చేసుకోవడానికి ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. కావున త్వరగా జీర్ణమయ్యే పదార్థాలు తీసుకోవడం ఉత్తమం.

**('మెడికల్ సైన్స్ వెలుగులో రంజాన్ ఉపవాసాలు' అనే పుస్తకంలోనుంచి)**




# ఖుర్ఆన్ ప్రస్తావించిన దైవ గ్రంథాలు

ముహమ్మద్ అజ్గర్ అలీ

## తౌరాత్

తౌరాత్ అవతరణ ప్రవక్త మూసా జీవితంలో ఒక ముఖ్యమైన సంఘటన. హదీసులలో పేర్కొన్నట్లుగా, తౌరాతు రమజాన్ ఆరవ తేదీన ప్రవక్త మూసాకు అవతరింపబడింది. ప్రవక్త వసీలా ఇబ్న్ అస్కా ప్రకారం తౌరాత్ రమజాన్ రెండవ వారంలో, అంటే రమజాన్ ఆరవ తేదీన వెల్లడి చేయబడిందని పేర్కొంది. (ముస్నద్ అహ్మద్, హదీసు 16984)

హజ్రత్ మూసా, అతని అనుచరులు బనీ ఇస్రాయీల్ ఈజిప్ట్ నుండి బయలుదేరి సినాయ్ పర్వతం (మౌంట్ తూర్ అని కూడా పిలుస్తారు) వైపు ప్రయాణిస్తున్నారు. అక్కడే అల్లాహ్ హజ్రత్ మూసాను పిలిచి ఆయనకు తౌరాతును ఇచ్చాడు. ఈ సంఘటన ఇస్లామిక్ చరిత్రలో ఒక ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంది, ఎందుకంటే తౌరాతు ద్యోతకం మతపరమైన దృక్కోణం నుండి మాత్రమే కాకుండా సామాజిక, రాజకీయ కోణం నుండి కూడా చాలా ముఖ్యమైనది.

తౌరాతు గ్రంథం ప్రవక్త మూసాకు దేవుని నుండి ప్రత్యేక ఆజ్ఞగా వెల్లడి చేయబడింది. తౌరాతు పుస్తకం యూదు దేశానికి చట్టపరమైన రాజ్యాంగం, అది వారి జీవితాలను నియంత్రించడానికి, నిర్వహించడానికి పంపబడింది.

### తౌరాత్ ప్రధాన సందేశం

**ఏకేశ్వరోపాసన (తౌహీద్)** : తౌరాతు ప్రజలు ఒకే దేవుడిని ఆరాధించాలని, ఆయన ఆదేశాలను పాటించాలని బోధిస్తుంది.

**న్యాయం, సామాజిక క్రమం** : సమాజంలో న్యాయం, సమానత్వం, క్రమాన్ని స్థాపించడానికి ఉద్దేశించిన చట్టాలను తౌరాతు కలిగి ఉంది.

**మతపరమైన చట్టాలు** : తౌరాతు గ్రంథం మతపరమైన చర్యలు, ఆరాధనా పద్ధతులు, త్యాగాలకు సంబంధించిన వివరణాత్మక మార్గదర్శకాలను కూడా అందిస్తుంది.

దివ్య ఖురాన్ ప్రకారం, అల్లాహ్ ప్రవక్త మూసాతో నేరుగా మాట్లాడాడు, ఆయనకు తౌరాతు జ్ఞానాన్ని అందించాడు. ఈ సంఘటన సూరా అన్-నిసా(164)లో ప్రస్తావించబడింది, అందులో అల్లాహ్ తాను నేరుగా మూసాతో మాట్లాడినట్లు చెప్పాడు.

తౌరాతు మొదట ఐదు భాగాలుగా విభజించబడింది. ఈ భాగాలలో మతపరమైన, సామాజిక, నైతిక సమస్యల వివరణాత్మక వివరణలు ఉన్నాయి.

జుడాయిజంలో, తౌరాతును తనఖ్ లేదా పాత నిబంధన అని పిలుస్తారు. దాని ప్రధాన అంశాలు:

**తౌహీద్ (దేవుని ఏకత్వం)** : ఒకే దేవుడిని ఆరాధించడం, ఆయన ఆజ్ఞలను పాటించడం.

**నైతిక, సామాజిక చట్టాలు** : దొంగతనం, హత్య, తప్పుడు సాక్ష్యం మొదలైన వాటిపై కఠినమైన ఆంక్షలు.

**ఆరాధన, త్యాగానికి సంబంధించిన చట్టాలు** : యూదుల ఆరాధన చట్టాలు, స్వచ్ఛతకు సంబంధించిన బోధనలు.

**న్యాయవ్యవస్థ** : శిక్షాస్మృతి, న్యాయమూర్తుల విధులు, బాధ్యతలు.

తౌరాతు సందేశం కేవలం మతపరమైనది కాదు, ఇది సామాజిక, చట్టపరమైన మరియు నైతిక దృక్పథాల నుండి ప్రజలకు మార్గదర్శకత్వం కూడా అందించింది.

తౌరాతు అల్లాహ్ పంపిన దైవ గ్రంథమే అయినా, కాలక్రమంలో యూదులు అందులో కొన్ని మార్పులు, వక్రీకరణలు చేశారు.

దివ్య ఖురాన్‌లో ఈ విధంగా ప్రస్తావించబడింది. సూరా అల్-బఖరా (ఆయత్: 79)లో కొంతమంది వ్యక్తులు తమ స్వంత చేతులతో పుస్తకాన్ని వ్రాసి, దానిని/ తౌరాత్‌గా మార్పు చేసి అల్లాహ్‌చే అవతరించినట్లు పేర్కొన్నారు.

కాలక్రమేణా తౌరాతు అసలు సందేశం, ఉద్దేశ్యం వక్రీకరించ బడింది. ఇస్లాం ఆవిర్భావంతో, దివ్య ఖురాన్ తుది తీర్పు, మార్గదర్శకత్వం అందించింది. దివ్య ఖురాన్ తౌరాతులోని అన్ని వక్రీకరించిన భాగాలను సరిదిద్దింది.

ఇస్లాంలో అత్యంత పవిత్రమైన నెలగా పరిగణించబడే రమజాన్ మాసంలో తౌరాత్ వెల్లడింపబడినది. తౌరాతు వెల్లడి సమయంలో, ప్రవక్త మూసా 40 రోజులు ఉపవాసం ఉన్నారు. ఇది స్వీయ శుద్ధీకరణకు చిహ్నంగా ఉంది. రమజాన్‌లో ఉపవాస సంప్రదాయం దీనితో ముడిపడి ఉంది. ఉపవాసం స్వీయ నియంత్రణ, స్వీయ శుద్ధి సందేశాన్ని ఇస్తుంది.

హజ్రత్ ముహమ్మద్(స) ప్రళయదినాన తన సమాజాన్ని ప్రస్తావిస్తూ, "నా సమాజానికి గొప్ప స్థానం ఉంటుంది" అని అన్నారు. హజ్రత్ మూసా మరియు హజ్రత్ ముహమ్మద్ మధ్య ప్రగాఢమైన సంబంధం ఉందని ఇది స్పష్టం చేస్తుంది. ముస్లింలు హజ్రత్ మూసా పుస్తకం, జీవితం నుండి న్యాయం, సహనం, అల్లాహ్‌పై నమ్మకం వంటి అనేక ముఖ్యమైన బోధనలను పొందుతారు.

# జబూర్

"జబూర్" అనేది దావీదు కీర్తనలకు అరబిక్ పదం. "జబూర్" హీబ్రూ బైబిల్, క్రైస్తవ పాత నిబంధనలో భాగం. జబూర్‌ను ఇస్లాంలో, తౌరాతు, సువార్త/ఇంజీల్, ఖురాన్‌లతో పాటు అల్లాహ్ (దేవుడు) వెల్లడించిన నాలుగు పవిత్ర గ్రంథాలలో ఒకటిగా భావిస్తారు,

ఇస్లామిక్ సంప్రదాయంలో, జబూర్ ప్రవక్త డేవిడ్ (అరబిక్‌లో దావూద్)కు వెల్లడి చేయబడిందని నమ్ముతారు, దావూద్ ఇస్లాంలో నీతిమంతుడైన ప్రవక్త, రాజుగా కూడా పరిగణించ బడతారు. జబూర్ జ్ఞానం, మార్గదర్శకత్వం, ఆధ్యాత్మిక అంతర్దృష్టి సందేశాలను కలిగి ఉంటుంది.

జబూర్ 150 కీర్తనలతో కూడి ఉంది, అవి కవితా ప్రార్థనలు మరియు పాటలు. కీర్తనలు ప్రశంసలు, కృతజ్ఞత, విలాపం మరియు జ్ఞానంతో సహా వివిధ ఇతివృత్తాలను కవర్ చేస్తాయి.

## జబూర్‌పై ఇస్లామిక్ దృక్పథం

ముస్లింలు అసలు జబూర్ కాలక్రమేణా మార్చబడిందని లేదా కోల్పోయిందని నమ్ముతారు.

ఖురాన్ అనేక వచనాలలో జబూర్‌ను ప్రస్తావిస్తుంది, గ్రంథంగా దాని ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జబూర్ జ్ఞానం, మార్గదర్శకత్వం కల పుస్తకం అని చెప్పినట్లు హదీసులలో ఉంది.

## ఖురాన్‌తో సారూప్యతలు

**ఏకేశ్వరోపాసన** : జబూర్, ఖురాన్ రెండూ దేవుని ఏకత్వాన్ని (తౌహీద్) నొక్కి చెబుతున్నాయి. జబూర్, ఖురాన్ రెండూ బహు దేవతారాధన, విగ్రహారాధనను తిరస్కరిస్తూ దేవుని ఏకత్వాన్ని నొక్కి చెబుతున్నాయి.

**నైతిక మార్గదర్శకత్వం** : రెండు గ్రంథాలు జబూర్, ఖురాన్ నైతిక మార్గదర్శకత్వం, ధర్మంపై బోధనలను అందిస్తాయి.

**ఆధ్యాత్మిక ఇతివృత్తాలు** : జబూర్, ఖురాన్ రెండూ విశ్వాసం, ఆశ, విముక్తి వంటి ఆధ్యాత్మిక ఇతివృత్తాలను అన్వేషిస్తాయి.

రెండు గ్రంథాలు జబూర్, ఖురాన్ దైవదౌత్యం ప్రాముఖ్యతను, దేవుని దూతలుగా ప్రవక్తల పాత్రను ధ్రువీకరిస్తున్నాయి.

జబూర్, ఖురాన్ రెండూ మరణానంతర జీవితంలో మానవ చర్యల జవాబుదారీతనం గురించి బోధిస్తాయి

రెండు గ్రంథాలు (జబూర్, ఖురాన్) న్యాయం, కరుణ, వినయంతో ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడం ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి.

జబూర్, ఖురాన్- రెండూ న్యాయం, సమానత్వం ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి.

రెండు గ్రంథాలు జబూర్, ఖురాన్ ఇతరుల పట్ల కరుణ, దయ చూపించడం యొక్క ప్రాముఖ్యత గురించి బోధిస్తాయి.

జబూర్, ఖురాన్ రెండూ నిజాయితీ, సమగ్రత ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి.

### జబూర్‌కు సంబంధించి ఖురాన్‌లో ప్రస్తావనలు

1. సూరా అల్-ఇస్రా (17:55): ఖురాన్ జబూర్‌ను ప్రవక్త దావూదుకు ప్రసాదించిన గ్రంథంగా పేర్కొంది.

2. సూరా అల్-అంబియా (21:105): ఖురాన్ జబూర్ నుండి ఒక వచనాన్ని ఉటంకిస్తూ సజ్జనులైన దాసులే భూమికి వారసులవుతారని నొక్కి చెబుతుంది.

3. సూరా అన్ నమ్ల్ (27:15): ఖురాన్ జబూర్‌ను జ్ఞానం మరియు మార్గదర్శకత్వం యొక్క పుస్తకంగా పేర్కొంది.

**ముగింపు:** జబూర్, ఖురాన్ ఇతివృత్తాలు, సందేశాలు మరియు విలువలలో అనేక సారూప్యతలను పంచుకుంటాయి. జబూర్, ఖురాన్ రెండు గ్రంథాలు ఏకదైవం, ప్రవక్తృత్వం, నీతి ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి. సద్గుణ జీవితాన్ని గడపడంపై మార్గదర్శకత్వాన్ని అందిస్తాయి.

## ఇంజీల్

"ఇంజీల్"" అనే అరబిక్ పదానికి అర్థం సువార్త. "ఇంజీల్" ఖురాన్, తౌరాతు, జబూర్‌లతో పాటు నాలుగు పవిత్ర గ్రంథాలలో ఒకటి.

ఇంజీల్ గ్రంథం ప్రవక్త జీసస్ (అరబిక్‌లో ఈసా)కు అల్లాహ్ (దేవుడు) ద్వారా అవతరించబడిందని ముస్లింలు నమ్ముతారు.

ఇంజీల్ మార్గదర్శకత్వం, జ్ఞానాన్ని కలిగి ఉన్న గ్రంథంగా పరిగణించబడుతుంది.

ఇంజీల్, తౌరాతు, జబూర్‌తో సహా మునుపటి గ్రంథాలను ధ్రువీకరిస్తుందని ఖుర్‌ఆన్ పేర్కొంది.

ఇంజీల్ అల్లాహ్ (దేవుడు) నుండి బని ఇస్రాయీల్ Children of Israel కు మార్గనిర్దేశం చేయడానికి ప్రవక్త (ఈసా)కు పంపబడిన దివ్యదర్శనమని ఇస్లాంలో నమ్ముతారు. ఇంజీల్ మార్గదర్శకత్వం, జ్ఞానం, ధర్మం గురించి బోధనలను కలిగి ఉన్న గ్రంథంగా పరిగణించబడుతుంది.

ఖురాన్ ప్రకారం, ఇంజీల్ తౌరాతును ధ్రువీకరిస్తుంది, మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది.

**ఇంజీల్‌లో ఈ క్రింది వాటి గురించి బోధనలు ఉన్నాయని నమ్ముతారు:**

- దేవుని ఏకత్వం, దైవాన్ని మాత్రమే ఆరాధించడంలో ప్రాముఖ్యత.
- ప్రవక్తృత్వం ప్రాముఖ్యత, దేవుని దూతలుగా ప్రవక్తల పాత్ర.
- మరణానంతర జీవితంలో మానవ చర్యల జవాబుదారీతనం.
- న్యాయం, కరుణ, వినయంతో నీతివంతమైన జీవితాన్ని గడపడం యొక్క ప్రాముఖ్యత.

క్రైస్తవులు సువార్త (కొత్త నిబంధన) దేవుని వాక్కు అని నమ్ముతుండగా, ముస్లింలు అసలు ఇంజీల్ ప్రవక్త ఈసా కు అవతరించబడిందని నమ్ముతారు, కానీ ప్రస్తుత సువార్త మార్పులకు గురైంది.

### ఇంజీల్ గురించి దివ్య ఖురాన్‌లో ప్రస్తావనలు

1. సూరా ఆలె ఇమ్రాన్ (3:3-4): ఖురాన్ ఇంజీల్‌ను ప్రవక్త ఈసాకు అవతరించబడిన గ్రంథంగా పేర్కొంది.

2. సూరా అల్-మాయిదా (5:46): ఇంజీల్ తౌరాతును ధ్రువీకరిస్తుందని, మార్గదర్శకత్వాన్ని అందిస్తుందని ఖురాన్ పేర్కొంది.

3. సూరహ్ మర్యం (19:30): ఖురాన్‌లో ప్రవక్త ఈసా తాను తౌరాత్‌ను ధృవీకరించడానికి, మార్గదర్శకత్వం తీసుకురావడానికి వచ్చానని చెప్పినట్లు ఉటంకిస్తుంది.

### ఇంజీల్‌కు ఖురాన్‌తో సారూప్యతలు

ఇంజీల్, ఖురాన్ రెండూ దేవుని ఏకత్వాన్ని (తౌహీద్) నొక్కి చెబుతున్నాయి.

ఇంజీల్, ఖురాన్ రెండు గ్రంథాలు ప్రవక్తృత్వం ప్రాముఖ్యతను, దేవుని దూతలుగా ప్రవక్తల పాత్రను ధృవీకరిస్తాయి.

ఇంజీల్, ఖురాన్ రెండూ ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడం ప్రాముఖ్యత గురించి బోధిస్తాయి.

**ముగింపు :** ఇంజీల్ ఇస్లాంలో పవిత్ర గ్రంథంగా పరిగణించబడుతుంది, ఇది ప్రవక్త ఈసాకు అవతరించింది. మార్గదర్శకత్వం, జ్ఞానాన్ని కలిగి ఉంది. ఇంజీల్ మునుపటి గ్రంథాలను ధృవీకరిస్తుందని, ఏకేశ్వరోపాసన, ప్రవక్తృత్వం, నీతి, ధర్మం ప్రాముఖ్యతను నొక్కి చెబుతుందని ముస్లింలు నమ్ముతారు.

## పవిత్ర ఖురాన్

ఖురాన్ ఇస్లాం పవిత్ర గ్రంథం, దీనిని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ద్వారా వెల్లడి చేయబడిన దేవుని (అల్లాహ్) వాక్కుగా భావిస్తారు. ఖురాన్ ప్రపంచవ్యాప్తంగా ముస్లిం

లకు మార్గదర్శకత్వం, జ్ఞానం, ఆధ్యాత్మిక వృద్ధికి ప్రాథమిక మూలం.

➢ ఖురాన్ ప్రవక్త ముహమ్మద్(స)కు 23 సంవత్సరాలలో, 610 నుండి 632 CE వరకు అవతరింపజేయబడింది.

➢ ఖురాన్ అరబీ భాషలో ఉంది. అరబీ స్వర్గపు భాషగా పరిగణించబడుతుంది.

➢ ఖురాన్ 114 అధ్యాయాలు లేదా సూరాలను కలిగి ఉంది, ప్రతి సూరా దాని స్వంత ప్రత్యేకమైన థీమ్ మరియు సందేశాన్ని కలిగి ఉంది.

➢ ఖురాన్‌లో 6,666 ఆయత్‌లు ఉన్నాయి, ప్రతి ఆయత్ దాని స్వంత ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కలిగి ఉంది.

➢ ఖురాన్ 1,400 సంవత్సరాలకు పైగా ఎటువంటి మార్పులు చేర్పులు లేకుండా దాని అసలు రూపంలో భద్రపరచబడింది

➢ ఖురాన్ దేవుని ఏకత్వాన్ని, ఆయనను మాత్రమే ఆరాధించే ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

➢ ఖురాన్ దైవదౌత్యం ప్రాముఖ్యతను, దేవుని దూతలుగా ప్రవక్తల పాత్రను వివరిస్తుంది..

➢ ఖురాన్ మరణానంతర జీవితంలో (ఆఖిరత్) మానవ చర్యల జవాబుదారీతనం గురించి బోధిస్తుంది.

➢ ఖురాన్ న్యాయం, కరుణ, వినయంతో నీతివంతమైన జీవితాన్ని (తఖ్వా) గడపడం ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

➢ ఖురాన్ ముస్లింలకు నీతివంతమైన జీవితాన్ని ఎలా గడపాలో మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది.

➢ ఖురాన్ దేవుడు, మానవత్వం, విశ్వం స్వభావం గురించి జ్ఞానం, అంతర్దృష్టులను కలిగి ఉంది.

➢ ముస్లింలు దేవునితో దృఢమైన సంబంధాన్ని పెంపొందించుకోవడానికి, ఆధ్యాత్మిక వృద్ధిని సాధించడానికి ఖురాన్ సహాయపడుతుంది.

➢ ముస్లింలు సరైన ఉచ్చారణ, స్వరంపై దృష్టి సారించి అరబిక్‌లో ఖురాన్ పఠిస్తారు.

➢ చాలా మంది ముస్లింలు ఖురాన్‌ను కంఠస్థం చేస్తారు, కొందరు హాఫిజ్ (ఖురాన్ మొత్తం కంఠస్థం చేసిన వారు) కూడా అవుతారు

➢ ముస్లింలు ఖురాన్‌ను తఫ్సీర్ ద్వారా అర్థం చేసుకుంటారు, ఇందులో ప్రతి ఆయత్ చారిత్రక సందర్భం, భాషా సూక్ష్మ నైపుణ్యాలు, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటారు.

➢ ఖురాన్ అనేక భాషలలోకి అనువదించబడింది, కానీ ముస్లింలు అరబిక్ మూలాన్ని అత్యంత అధికారికం, పవిత్రమైనదిగా నమ్ముతారు

## ఖురాన్ శాస్త్రాలు

**1. ఇల్మ్ అల్-ఖురాన్:** ఈ అధ్యయన రంగం ఖురాన్ చరిత్ర, సంకలనం, సంరక్షణపై దృష్టి పెడుతుంది.

**2. అస్బాబ్ అల్-నుజూల్:** ఈ అధ్యయనం ప్రతి ఆయత్ యొక్క అవతరణ చుట్టూ ఉన్న చారిత్రక సందర్భం మరియు పరిస్థితులను అన్వేషిస్తుంది.

## ఖురాన్ పారాయణం, తజ్వీద్

**1. ఖిరాత్:** ముస్లింలు వేర్వేరు ఖిరాత్ (పఠన శైలులు)లో ఖురాన్‌ను పఠిస్తారు, ఇవి ఉచ్చారణ, స్వరం మరియు లయలో మారుతూ ఉంటాయి.

**2. తజ్వీద్:** ఈ పదం ఉచ్చారణ, స్వరం, విరామాలతో సహా సరైన ఖురాన్ పారాయణం కోసం నియమాలు, మార్గదర్శకాలను సూచిస్తుంది.

## ఇస్లామిక్ నాగరికతపై దివ్య ఖురాన్ ప్రభావం

**1. సాహిత్యం, కవిత్వం:** ఖురాన్ సాహిత్య శైలి, కవితా భాష అరబిక్ సాహిత్యం, కవిత్వం లెక్కలేనన్ని రచనలను ప్రేరేపించాయి.

**2. కళ, వాస్తుశిల్పం:** ఖురాన్ ఇతివృత్తాలు, ఉద్దేశ్యాలు, కాలిగ్రఫీ, జ్యామితి, అలంకారంతో సహా ఇస్లామిక్ కళ, వాస్తుశిల్పాన్ని ప్రభావితం చేశాయి.

**3. సైన్స్, తత్వశాస్త్రం:** జ్ఞానం, విమర్శనాత్మక ఆలోచనపై ఖురాన్ ప్రాధాన్యత చరిత్ర అంతటా ముస్లిం పండితులను, శాస్త్రవేత్తలను ప్రేరేపించింది.

## సమకాలీన ప్రాముఖ్యత

**1. ఆధునిక జీవితానికి మార్గదర్శకత్వం:** ముస్లింలు నైతికత, సామాజిక న్యాయంపై ఖురాన్ బోధనలలో మార్గదర్శకత్వం, జ్ఞానాన్ని కనుగొంటూనే ఉన్నారు.

**2. మతాంతర సంభాషణ:** శాంతి, కరుణ, సహకారం ఖురాన్ సందేశం మతాంతర సంభాషణ, అవగాహనను సులభతరం చేసింది.

**3. ఆధ్యాత్మిక పెరుగుదల, స్వీయ-అభివృద్ధి:** తమను, తమ సమాజాలను మెరుగుపరచుకోవాలనుకునే ముస్లింలకు ఖురాన్ ఆధ్యాత్మిక ప్రేరణ, మార్గదర్శకత్వానికి మూలంగా ఉంది.

**ముగింపు**

ఖురాన్ ఇస్లాంలో అత్యంత పవిత్ర గ్రంథం. ఖురాన్ ఇతివృత్తాలు, సందేశాలు, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు స్ఫూర్తినిస్తూ, మార్గనిర్దేశనం చేస్తూనే ఉంది.



# ఖుర్‌ఆన్ పఠనం... శాంతి, సౌభాగ్యాలకు మార్గం

- అర్షియా

పవిత్ర ఖుర్‌ఆన్ పఠనం మానవాళి జీవనానికి మార్గదర్శి. రమజాన్ ఉపవాసాల వేళ ఖుర్‌ఆన్ పఠనం రెట్టింపు పుణ్యాన్ని అందిస్తుంది. ఖుర్‌ఆన్ పఠనం తనివి తీరనిది. పవిత్ర గ్రంథం ద్వారా జ్ఞానాన్ని పొంది, దాన్ని ఇతరులకు బోధించేవారు అందరి కన్నా శ్రేష్టులని దైవ ప్రవక్త ఉపదేశించారు. ఖుర్‌ఆన్ బోధనలను పాటించి తన జీవితాన్ని సంస్కరించుకొని, ఇతరుల జీవితాలను సంస్కరించే వ్యక్తే ప్రపంచంలో అత్యుత్తమ మనిషి. ఖుర్‌ఆన్ ప్రపంచంలోనే అత్యంత విలువైన సంపదగా ప్రవక్త అభివర్ణించారు. ఖుర్‌ఆన్ అర్థం కాకపోయినా, ధారాళంగా చదవలేకపోయినా... విశ్వాసంతో, అల్లాహ్ మీద భక్తితో చదవాలి. అలా చదవడమూ పుణ్యప్రదమే. ఖుర్‌ఆన్ చదువుతున్న వారికి ప్రశాంతత ఉంటుంది.

ఖుర్‌ఆన్ ఇండ్లలో పఠిస్తే షైతాన్ దరి చేరడు. బఖరా సూరాను అర్థం చేసుకొని చదివితే కుటుంబ జీవిత నియమాలు, సూత్రాలు వివరంగా తెలుసుకోవచ్చు. అల్ బఖరా, ఆలి ఇమ్రాన్ సూరాలు ప్రళయం నుంచి మనల్ని రక్షించే పుణ్యాన్ని ప్రసాదిస్తాయి. ఇవి విశ్వాసులను జీవితాంతం ముందుకు నడిపిస్తాయి. ఈ సూరా సారాంశాన్ని జీవితంలో ఆచరించినవారు ముక్తిని పొందుతారు. ఏకేశ్వరోపాసన గురించి వివరించి మనకు ధార్మిక జ్ఞానాన్ని కలిగించే ఆయతుల్ కుర్సీ ఖుర్‌ఆన్లో అన్నింటి కన్నా గొప్ప ఆయత్ (వచనం). దీన్ని పఠించేవారి దరిదాపులకు షైతాన్ రాడు. ఫాతిహా సూరా, బఖరా సూరా చివరి ఆయత్ దైవ ప్రవక్త(స)కు ప్రసాదించిన రెండు వరాల వంటివి! అవి ఖుర్‌ఆన్ సారాంశాన్ని, అల్లాహ్ ఏకత్వ సారాన్ని కొన్ని వాక్యాల్లోనే వివరిస్తాయి. ఈ రెండు సూరాలు మనుషుల్ని చెడు నుంచి కాపాడతాయి. ఇక కహఫ్ సూరాలో మొదటి పది ఆయత్‌లను కంఠస్థం చేసినవారు ఉపద్రవాల నుంచి రక్షణ పొందుతారు. ఇఖ్‌లాస్ సూరాను పఠించినట్లయితే మూడో వంతు ఖుర్ ఆన్ పఠించినట్లేనని దైవ ప్రవక్త సెలవిచ్చారు. ఈ సూరా పఠనం స్వర్గ ప్రవేశానికి దారి చూపుతుంది. ముఅవ్వజతైన్ సూరాలు మనుషులను సత్య మార్గంలో నడిపించి గొడవల నుంచి రక్షిస్తాయి. ఖుర్‌ఆన్ పదాల్లో కూడా శుభం ఉంటుందని ప్రవక్త బోధించేవారు. మన జీవితంలో అన్నింటి కన్నా మొదటి అమానతు అల్లాహ్ ప్రసాదించిన ఈ జీవితమేనని ఖుర్‌ఆన్ బోధించింది. మానవ సంబంధాలన్నింటిలో అమానతులు వ్యాపించి ఉంటాయి. ఖుర్‌ఆన్ రక్త సంబంధాలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. ఖుర్‌ఆన్ ఆదేశాల ప్రకారం మనం వాటికి జీవితాంతం విలువ ఇవ్వాలి. ఖుర్‌ఆన్ పఠించని హృదయం బంజరు భూమి లాంటిది. ఖుర్‌ఆన్ వచనాలు అల్లాహ్ లాగే మహోన్నతమైనవి. కాబట్టి ఖుర్‌ఆన్ పఠనంలో ఎంత సమయం వెచ్చించినా అది అమూల్యమైనదే! ఖుర్‌ఆన్‌లోని ప్రతి పదం, అక్షరం పుణ్యప్రదమైనదే. ఖుర్‌ఆన్ సర్వ కాల, సర్వావస్థల్లో మానవాళిని కాపాడే దివ్య గ్రంథం. అది దాసులు (విశ్వాసులు) దైవంతో దృఢమైన సంబంధాన్ని ఏర్పరుచుకొనేందుకు సహాయం చేసే ఒక దివ్యమైన తాడు లాంటిది. ఖుర్‌ఆన్‌ను జీవిత మార్గదర్శిగా భావిస్తే, స్వీకరిస్తే మన జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగిపోవచ్చు. అందుకే ఇన్ని రకాల శుభాలను చేకూర్చే ఖుర్‌ఆన్ పఠనాన్ని దినచర్యగా చేసుకుందాం... శాంతి, సౌభాగ్యాలను ఆస్వాదిద్దాం!

## పఠనం పవిత్రమైతే... జీవితం ధన్యమైనట్టే

ఈ ప్రపంచంలో అవతరించిన నాటి నుంచి ఎలాంటి మార్పులు, చేర్పులకు లోను కాని ఏకైక ధార్మిక గ్రంథం ఖుర్ ఆన్ మాత్రమే!

అందులోని ప్రతి అక్షరం పుణ్యప్రదం. అందుకే తరచూ ఖుర్‌ఆన్ ను పఠిస్తూ ఉండాలి. ముఖ్యంగా రమజాన్ మాసంలో ఏకాగ్రతతో దాన్ని పారాయణం చేయాలి. అప్పుడప్పుడూ పున:శ్చరణ చేసుకోవాలి. ఖుర్‌ఆన్ లోని ముఖ్యమైన సూరాలను మనో ఫలకంపై ముద్రించుకోవాలి. ఖుర్‌ఆన్ లోని అంశాలను అర్థం చేసుకుంటూ వాటికి ప్రభావితం కావాలి. దైవప్రవక్త(స) నిదానంగా, శ్రావ్యంగా ఖుర్‌ఆన్ ను పఠించేవారు. అందులోని భావాలకు అనుగుణంగా భావోద్వేగానుభూతి చెందేవారు. ఈ విధానాన్ని ప్రతి ముస్లిం పాటించడం శ్రేయోదాయకం. ఖుర్‌ఆన్‌ను పూర్తిగా పారాయణం చేయడానికి కొన్ని రోజులు కేటాయించాలి. ఖుర్‌ఆన్‌ను బిగ్గరగా చదివితే ఇతరులు కూడా దాన్ని విని ప్రభావితులవుతారు. మెల్లగా చదివితే పఠించిన వ్యక్తి ప్రయోజనం పొందుతాడు. ఖుర్‌ఆన్‌ను పాటలాగా పాడకూడదు. బాధ పడుతూ శోక రాగాలు తీసినట్టు పారాయణం చేయకూడదు. ఖుర్‌ఆన్‌కు అవమానం జరుగుతుందని భావించిన ప్రదేశానికి ఆ దివ్య గ్రంథాన్ని తీసుకెళ్లకూడదు.

ఖుర్‌ఆన్‌ను దైవ వాణిగా విశ్వసించి ఆచరించిన వారు ధన్యత పొందుతారు. ఖుర్‌ఆన్ నిషేధించిన అంశాలను విడనాడి, ఖుర్ ఆన్ ఆదేశాలను పాటించినవారు జీవితాన్ని చరితార్థం చేసుకుంటారు. ఖుర్‌ఆన్‌ను సమగ్రంగా అధ్యయనం చేసిన నిష్ణాతులకు సమాజంలో ఎంతో గౌరవం లభిస్తుంది. ఖుర్‌ఆన్ లాంటి ప్రపంచపు అత్యుత్తమ  జ్ఞాన సంపదను పొందిన తర్వాత ఎవరైనా నిరపేక్షా పరుడై పోవాలి. ప్రాపంచిక లాభాల కోసం కాకుండా స్వర్గ లోక ప్రాప్తి, పుణ్య ఫలాల కోసం మాత్రమే అల్లాహ్‌కు భయపడుతూ భక్తి శ్రద్ధలతో ఖుర్‌ఆన్‌ను పఠించాలి. ఖుర్‌ఆన్‌ను ఆయా స్థానిక యాసల ప్రకారం పారాయణం చేయువచ్చు. ఖుర్‌ఆన్‌ను పారాయణం చేసి ఇతరులకు వినిపించడం ధార్మిక బాధ్యతగా భావించాలి. కానీ అలా ఆ పారాయణాన్ని ఇతరులకు వినిపించినందుకు ప్రతిఫలాన్ని స్వీకరించకూడదు. ఖుర్‌ఆన్ పారాయణాన్ని జీవనోపాధిగా మార్చుకున్నవారు ప్రళయ దినాన పరాభవం పాలవుతారు.

# ప్రకాశం జిల్లాలో నిత్యావసరాల కిట్ల పంపిణీ



ప్రకాశం జిల్లా కంభం పట్టణంలో జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో 2025 మార్చి 9వ తేదీ ఆదివారం అర్హులైన నిరుపేద 100 కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, నూనె, చక్కెర, చింతపండు వంటి పది రకాల నిత్యావసర వస్తువులతో తయారుచేసిన కిట్లను ఇంటింటికి వెళ్లి అందచేశారు. ఈ కార్యక్రమాన్ని గత 12 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని సంఘసేవా విభాగ బాధ్యులు షేక్ ముహమ్మద్ రఫీ పేర్కొన్నారు. ఈ రేషన్ కిట్ల కోసం విరాళాలు అందజేసిన దాతలందరికీ స్థానిక అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ గౌస్‌ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జమాఅత్ సభ్యులు, కార్యకర్తల కృషిని నగర ప్రముఖులు కొనియాడారు. "జకాత్" ధనానికి సంబంధించిన ఆరాధన. "నమాజ్ చేయండి, జకాత్ ఇవ్వండి" అని దివ్య ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల ప్రస్తావించబడింది. ఆర్థిక స్థోమత గల ప్రతి వ్యక్తి ప్రతి సంవత్సరం తన సంపద నుండి రెండున్నర శాతం జకాత్ తీసి, పేద సాదలకు, సంస్థలకు దానం చేయటం విధి (ఫర్జ్) గావించబడింది అని ముఫ్తీ యాసిన్ గారు అన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్ జలీల్, రసూల్ బేగ్, లెక్చరర్ నాయబ్ రసూల్, ఫారూఖ్, అబ్దుల్లా ఖాన్, ఆసిఫ్ ఖాన్, అల్తాఫ్ హుస్సేన్ ఖాన్, రహమతుల్లా ఖాన్, శంశీర్ బేగ్, జమాఅతె ఇస్లామీ హింద్ సభ్యులు కార్యకర్తలు, స్థానిక అధ్యక్షుడు చాంద్ బాషా , కార్యదర్శి వసీం, సభ్యులు బాజిద్, అబూ బకర్ సిద్దీక్, అబ్దుల్ రవూఫ్ మరియు "మస్జిద్ ఏ రహ్మానియా" జమాఅత్ సభ్యులు పాల్గొన్నారు.

## లోధిఖాన్‌పేటలో...

ప్రకాశం జిల్లా లోధి ఖాన్ పేట గ్రామంలో జమాఅతె ఇస్లామీ హింద్ స్థానిక శాఖ సంఘసేవా విభాగము ఆధ్వర్యంలో మార్చి 10వ తేదీన అర్హులైన నిరుపేద కుటుంబాలకు బియ్యం, కంది పప్పు, నూనె, చక్కెర, చింతపండు వంటి పది రకాల నిత్యావసర వస్తువులతో తయారుచేసిన కిట్లను ఇంటింటికి వెళ్లి అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధ్యక్షులు జనాబ్ ఉస్మాన్ సాహెబ్, పి అబ్దుల్లా ఖాన్, హుస్సేన్ బేగ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.




## కాలుష్య భారతం

మన నగరాలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. ప్రపంచ వాయు నాణ్యత నివేదిక-2024 ప్రకారం అత్యంత కాలుష్య భరిత 20 నగరాల్లో 13 మన దేశంలోనే ఉన్నాయి. కాలుష్య రాజధానుల్లో వరుసగా ఆరో ఏడాది కూడా ఢిల్లీ మొదటి స్థానంలో నిలిచింది.

**కాలుష్యంలో టాప్-20 నగరాలు**

బర్నిహాట్ (ఇండియా), ఢిల్లీ(ఇండియా), కారాగాండా (కజకిస్థాన్), ముల్లాన్‌పూర్ (ఇండియా), లాహోర్ (పాక్), ఎంజామెనా (చాద్), ఫరీదాబాద్ (ఇండియా), లోని (ఇండియా), న్యూఢిల్లీ (ఇండియా), ముల్తాన్ (పాక్), పెషావర్ (పాక్), సియాల్‌కోట్ (పాక్), గురుగ్రామ్ (ఇండియా), గంగానగర్ (ఇండియా), హొటన్ (చైనా), గ్రేటర్ నోయిడా (ఇండియా), భీవండి (ఇండియా), ముజఫర్‌నగర్ (ఇండియా), హనుమాన్‌గఢ్ (ఇండియా), నోయిడా (ఇండియా)

## ఆయుధాల దిగుమతిలో భారత్ నంబర్ 2

ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా ఆయుధాలు దిగుమతి చేసుకునే దేశాల్లో ఉక్రెయిన్ టాప్‌లో నిలిచింది. రష్యాతో యుద్ధం ప్రభావం వల్ల ఉక్రెయిన్ దిగుమతులు భారీగా పెరిగాయి. 2015-19తో పోలిస్తే 2020-24 మధ్య ఆ దేశ దిగుమతులు 100 రెట్లు పెరగడం గమనార్హం. అదే సమయంలో ఉక్రెయిన్ తర్వాత రెండో స్థానంలో భారత్ నిలిచింది. భారత్ దిగుమతులు 9.3 శాతం తగ్గినప్పటికీ ద్వితీయ స్థానంలో నిలిచింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ఈ వివరాలు తెలిపింది.

## 10 వేల కోట్లిచ్చినా ఎన్ఈపీ అమలుచేయం

కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ఒక 'విధ్వంసక నాగ్‌పూర్ ప్రణాళిక' అని, కేంద్రం దానికి 10 వేల కోట్ల రూపాయల నిధులు ఇచ్చినా దాని అమలుకు తమ రాష్ట్రం అంగీకరించదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పునరుద్ఘాటించారు. చెంగల్పట్టులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హిందీ, సంస్కృత భాషలను అనుమతిస్తే తమిళనాడుకు రూ.2,000 కోట్లను ఇస్తామంటూ అహంకార పూరితంగా సోమవారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారన్నారు. జాతీయ విద్యావిధానం ప్రవేశపెడితే అది రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను నాశనం చేస్తుందని ఆయన చెప్పారు.

## సిద్దిపేటలో గీటురాయి రమజాన్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



సిద్దిపేట పట్టణంలోని మహబూబ్ ఉన్నిసా మసీదులో గీటురాయి వారపత్రిక పవిత్ర రమజాన్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా జమాఅతే ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షులు ముహమ్మద్ అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ, ప్రతి ఏటా రమజాన్ మాస సందర్భంగా ప్రత్యేక సంచిక విడుదల చేయడం జరుగుతుందని, ఈ పత్రికలో రమజాన్ మాసానికి సంబంధించిన వ్యాసాలు ధార్మిక జ్ఞానాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గీటురాయి రచయిత ముహమ్మద్ వహీదుద్దీన్ మాట్లాడుతూ గీటురాయి పత్రిక నాలుగు శతాబ్దాలుగా ధార్మిక నైతిక విలువలే పునాదులుగా స్వచ్ఛమైన, తీయనైన తెలుగు భాషలో తన ప్రస్థానం కొనసాగిస్తుందని, గీటురాయి పత్రిక సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదర భావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలు, బేధ భావాలు సమసి పోవడానికి, సాంఘిక న్యాయం నెల కొనడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. ఇస్లాం, ముస్లింలపై ఉన్న అపార్థాలను, అపోహాలను తొలగించడం, ఇస్లాం యొక్క నిజమైన బోధనలని ఎలాంటి హెచ్చు తగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియపరచడం ముఖ్య ఆశయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముహమ్మద్ హబీబ్ ఉద్దీన్, ముహమ్మద్ అబ్దుల్లా, ముహమ్మద్ గౌస్ ఉద్దీన్, హాజీ సిద్దిఖీ, ముహమ్మద్ ఖజామీయా, ముహమ్మద్ కలీముద్దీన్ ఇక్బాల్, ముహమ్మద్ కరీం లాలా, ముహమ్మద్ అతీఫుద్దీన్, ముహమ్మద్ అసదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




## మొక్కల ఉనికిని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్.. 2040 నాటికి ప్రపంచంలో ఆహార సంక్షోభం!

మైక్రోప్లాస్టిక్‌లు మొక్కల కిరణజన్య సంయోగ క్రియను దెబ్బతీస్తున్నాయని, 2040 నాటికి 40 కోట్ల మంది ఆకలితో అలమటించే ప్రమాదముందని చైనా పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. నాన్జింగ్ యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం, కాలుష్యం వల్ల మక్కలు, వరి, గోధుమ తదితర పంటలు ఉనికిలో లేకుండా పోతున్నాయని, ప్రధాన పంటల్లో 4 నుంచి 14 శాతం వరకు నష్టపోతున్నాయని పరిశోధకులు అంచనా వేశారు. 2058 నాటికి ప్రపంచ జనాభా 1,000 కోట్లకు చేరుకోనున్న నేపథ్యంలో సరిపడా ఆహారాన్ని ఉత్పత్తి చేయటం సవాల్‌గా మారుతుందని హెచ్చరించారు. దీంతో ప్రపంచ ఆహార భద్రతకు తీవ్ర ముప్పు పొంచి వుందని, కాలుష్య కారణంగా ఆహార సరఫరా గణనీయంగా తగ్గుతుందని వారు తెలిపారు. ఇప్పటికే (2022నాటికి) ఆకలి సంక్షోభం పెరగటంతో 70 కోట్ల మందిపై దాని ప్రభావం పడిందని, మైక్రోప్లాస్టిక్స్ కాలుష్యం ఇదే విధంగా సాగితే తీవ్ర ముప్పు వాటిల్లుతుందని అధ్యయనం పేర్కొన్నది.

## ఇరాన్‌తో అణు ఒప్పందానికి రెడీ

ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు జరపాలని భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఇరాన్ నాయకత్వానికి ఇటీవల ఒక లేఖ రాశారు. దీనివల్ల ఇరాన్‌కే ప్రయోజనాలు వున్నాయని, అందువల్ల వారు చర్చలకు అంగీకరిస్తారని భావిస్తున్నట్లు ఫాక్స్ బిజినెస్ నెట్‌వర్క్ బ్రాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పారు. "వారు కూడా ఈ లేఖ రావాలని కోరుకుంటున్నారని అనుకుంటున్నాను. ఎందుకంటే మనం ఇంకో అణ్వాయుధాన్ని అనుమతించలేం. కాబట్టి మనం మరో ప్రత్యామ్నాయాన్ని చూసుకోవాల్సి వుంది." అని ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేనీని ఉద్దేశించి ఆయన ఈ లేఖ రాశారు.

## సుంకాల యుద్ధం అమెరికాకే గుదిబండగా మారుతోంది

రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన వెంటనే ట్రంప్ మొదలుపెట్టిన సుంకాల యుద్ధం అమెరికాకే గుదిబండగా మారుతోంది. చైనా, భారత్, కెనడా, మెక్సికో, యూరప్ దేశాల మీద.. పరస్పర పన్నుల పేరిట ట్రంప్ కొరడా ఝుళిపిస్తున్న విషయం తెలిసిందే. గత కొన్ని దశాబ్దాలుగా అమలైన ప్రపంచీకరణ విధానాలతో యావత్ ప్రపంచం ఓ కుగ్రామంలా తయారైంది. ఇటువంటప్పుడు, ట్రంప్ కొత్తగా.. 'మాకు మేమే.. మీకు మీరే' అంటూ తెచ్చిన సుంకాలతో ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమవుతున్నాయి. స్వయంగా అమెరికా కూడా దీన్ని తప్పించుకోలేకపోతోంది. తీవ్ర అనిశ్చితి, ఆందోళన నేపథ్యంలో భారీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను అమెరికా స్టాక్‌మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకుంటున్నారు. దీంతో గత 20 రోజుల వ్యవధిలో ఆ దేశ స్టాక్‌మార్కెట్లలో నమోదైన టాప్-500 కంపెనీలు (వీటిని స్టాండర్డ్ అండ్ పూర్స్ 500 లేదా ఎస్ అండ్ పీ 500 అని అంటారు) ఏకంగా 4 లక్షల కోట్ల డాలర్ల (రూ.348.75 లక్షల కోట్ల) నష్టాన్ని చవి చూశాయి. మన దేశ బడ్జెట్ (రూ.50.65 లక్షల కోట్లు)తో పోల్చుకుంటే ఇది దాదాపు ఏడింతలు.

## కెనడా కొత్త ప్రధానిగా మార్క్ కార్నీ



కెనడాలో అధికార లిబరల్ పార్టీ కొత్త ప్రధానిగా మార్క్ కార్నీ ఎన్నికయ్యారు. దీంతో తదుపరి ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రధాని పదవి నుంచి వైదొలగనున్నట్లు జస్టిన్ ట్రూడో ఈ జనవరిలో ప్రకటించిన నేపథ్యంలో లిబరల్ పార్టీ నూతన సారథి ఎన్నిక అనివార్యమైంది. ఇందులో బ్యాంక్ ఆఫ్ కెనడా మాజీ గవర్నర్ మార్క్ కార్నీ విజేతగా నిలిచారు. 59 ఏళ్ల కార్నీ రెండో స్థానంలో ఉన్న క్రిస్టియా ఫ్రీలాండ్‌ను ఓడించి పార్టీ నూతన సారథిగా ఎన్నికయ్యారు. దీంతో తొమ్మిదేళ్ల ట్రూడో పాలనకు తెరపడినట్లైంది. మొత్తం 150,000 పార్టీ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. కార్నేకు 131,674 ఓట్లు వచ్చాయి. ఇవి 85.9 శాతంతో సమానం. రెండో స్థానంలో ఉన్న క్రిస్టియా ఫ్రీలాండ్ 11,134, కరినా గౌల్డ్‌కు 4,785, ఫ్రాంక్ బేలిస్‌కు 4,038 ఓట్లు వచ్చాయి. డొనాల్డ్ ట్రంప్ నుంచి సుంకాల ముప్పు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ.. కార్నీ 24వ ప్రధానిగా కెనడా పాలన పగ్గాలు చేపట్టనున్నారు.

# దివ్య ఖుర్‌ఆన్ అవతరించిన నెల పవిత్ర రమజాన్

**ముహమ్మద్ వహీదుద్దీన్**

**దివ్య ఖుర్‌ఆన్ రమజాన్ మాసంలో అవతరించింది.** ఇది చిట్టచివరి ఆకాశ గ్రంథం. దీని తర్వాత మరే గ్రంథమూ రాదు. ప్రళయం వరకు ఎటువంటి మార్పులు చేర్పులు ఉండవు. ఎందుకంటే స్వయంగా అల్లాహ్‌నే దీనిని రక్షించే బాధ్యత తీసుకున్నాడు. ప్రపంచంలో ఎక్కువగా చదివే గ్రంథం అంటే దివ్యఖుర్‌ఆన్ మాత్రమే.

దివ్య ఖుర్‌ఆన్ చదవడం వల్ల మనసుకు ప్రశాంతత కలుగుతుంది. మన జీవితంలో జరిగే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. సరైన మార్గం చూపుతుంది. కాంతి వైపు నడిపిస్తుంది. చెడులకు బహు దూరంగా ఉంచుతుంది. మంచి వైపు, పుణ్యకార్యాల వైపు వేగంగా అడుగులేపిస్తుంది. మనిషిలో మాట్లాడే పద్ధతి, క్రమశిక్షణ ఏర్పడుతుంది. పెద్దలకు ఇచ్చే గౌరవం, తల్లిదండ్రుల సేవ, భార్య పైన ప్రేమ, చిన్న పిల్లల పట్ల దయ చూపడం, దానధర్మాలు చేయడం వంటి ఉత్తమ గుణాలు జనిస్తాయి. కుటుంబంలో ఆనంద జీవితం ఏర్పడుతుంది. సమాజంలో మంచి మార్పు వస్తుంది.

అంతిమ దివ్యఖుర్‌ఆన్, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)పై 23 సంవత్సరాలలో మొత్తం ఖుర్‌ఆన్ అవతరించింది. సందర్భానుసారం ఆయతులు అవతరించబడ్డాయి. అల్లాహ్‌నే దీనిని స్వయంగా రచించాడు. దివ్యఖుర్‌ఆన్‌ను, దైవప్రవక్త(స) సున్నత్‌లను దృఢంగా పట్టుకొని నడిచేవారు ఎప్పటికీ చీకటిలో ఉండరు. అటువంటి వారే ఇహపర లోకంలో సాఫల్యం పొందుతారు. స్వర్గవనాలలో ఉన్నతమైన స్థానాలలో ఉంటారు.

ఖుర్‌ఆన్ గ్రంథాన్ని ఎలా పఠించాలో అల్లాహ్ ఈవిధంగా తెలుపుతున్నాడు

మీరు ఖుర్‌ఆన్ పఠించడానికి ఉపక్రమించినప్పుడు (ముందుగా) శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుండి దేవుడ్ని శరణు వేడుకోండి. విశ్వ ప్రభువును నమ్ముకున్న విశ్వాసులపై వాడి పాచిక పారదు. వాడ్ని సంరక్షకుడుగా చేసుకుని (వాడు ఆడించినట్లు ఆడుతూ) మిథ్యా దైవాల్ని ఆరాధించే వారిపై మాత్రమే వాడి ఆటలు సాగుతాయి.

"కనుక (అది) కాదు, నక్షత్రాల స్థానాలు, కక్ష్యలు సాక్షిగా చెబుతున్నాము. మీరు తెలుసుకుంటే, ఇది చాలా పెద్ద ప్రమాణం, ఇది ఒక మహోన్నతమైన, ఖుర్‌ఆన్ ఒక సురక్షితమైన గ్రంథంలో వ్రాయబడి ఉంది. దానిని పరిశుద్ధులు తప్ప మరెవరూ తాకలేరు, ఇది సకల లోకాల ప్రభువు అవతరింపజేసినటువంటిది.

(అల్ వాఖిఅహ్ : 56: 75–80)


ఈ ఖుర్‌ఆనును మేము సత్యంతో అవతరింపజేశాము. సత్యంతోనే అది అవతరించింది. ప్రవక్తా! (విశ్వాసులకు) శుభవార్త అందించటానికి (అవిశ్వాసులకు) హెచ్చరిక చెయ్యటానికి తప్ప మేము నిన్ను మరొక పని కొరకు పంపలేదు. మేము ఈ ఖుర్‌ఆన్‌ను కొద్దికొద్దిగా అవతరింపజేశాము. నీవు దానిని నెమ్మదిగా ప్రజలకు వినిపించాలని, మేము దానిని సందర్భాన్నిబట్టి క్రమక్రమంగా అవతరింపజేశాము. ప్రవక్తా! వారితో ఇలా అను : మీరు దేనిని నమ్మండి నమ్మకపోండి. ఇదివరకు జ్ఞానం ఇవ్వబడినవారికి దానిని వినిపించినప్పుడు వారు ముఖాన్ని నేలకు ఆనించి సాష్టాంగపడి ముక్త కంఠంతో ఇలా అంటారు : "మా ప్రభువు పరి శుద్ధుడు. ఆయన వాగ్దానం పూర్తయి తీరవల సిందే" వారు ముఖాన్ని నేలకు ఆనించి విలపిస్తూ పడిపోతారు. దానిని విన్న తరువాత వారి అణుకువ మరింత పెరుగుతుంది. (17: 105–109)

చూడు, ఖుర్‌ఆన్ చదవటంలో తొందరపడకు, నీ వైపునకు దాని వహీ (అవతరణ) పూర్తి కానంతవరకు, ఇలా ప్రార్థించు; "ఓ ప్రభూ! నాకు మరింత జ్ఞానం ప్రసాదించు" (తాహా : 20: 114)

ప్రవక్తా! ఈ దివ్యానిష్పృతి గుర్తుంచుకోవడానికి వడివడిగా నాలుక తిప్పకు. దాన్ని గుర్తు చేయించటం, నీ చేత చదివించడం మా పని. కనుక మేము పఠిస్తున్నప్పుడు నీవు శ్రద్ధగా ఆలకించు చాలు. తర్వాత దాని భావం తెలియ జేయడం కూడా మా బాధ్యతే.

(అల్ ఖియామహ్ 75: 16–19)

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**